



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 350 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి సోమవారం 4 ఆగస్టు 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న లొల్లి...

## కవిత, జగదీశ్ రెడ్డి మధ్య మాటల తూటాలు!

### బీఆర్ఎస్‌లో తారాస్థాయికి చేరిన నేతల మధ్య విభేదాలు

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు
- జగదీశ్ రెడ్డి ఓ 'లిల్లిపుట్' అని, కేసీఆర్ లేకపోతే ఆయనెవరని వ్యాఖ్య
- తనపై కొందరు పార్టీ నేతలే కుట్ర చేస్తున్నారని కవిత ఆరోపణ
- కవిత వ్యాఖ్యలకు జగదీశ్ రెడ్డి ఘాటుగా బదులు, సెటైర్లు
- కేసీఆర్ శత్రువుల మాటలను కవిత వాడుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపణ



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. జగదీశ్ రెడ్డిని 'లిల్లిపుట్' అంటూ సంబోధించిన కవిత, కేసీఆర్ నీడలో బతికే ఆయనకు సొంత అస్తిత్వం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై జగదీశ్ రెడ్డి కూడా అంతే స్థాయిలో స్పందిస్తూ సెటైరికల్ కౌంటర్ ఇచ్చారు.

ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడిన కవిత, తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేస్తున్న అనుచిత వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్య నేతల హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. "పార్టీలోని ఒక అగ్రనేత ప్రోద్బలంతోనే నాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నేతలు ఎవరూ దీనిపై మాట్లాడటం లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగదీశ్ రెడ్డిని ఉద్దేశిస్తూ, "కేసీఆర్ అనే నీడ లేకపోతే మీరెవరు? నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశారు. తర్వాత పార్టీలో చేరిన ఓ చిన్న నేత కూడా నా విశ్వసనీయతను ప్రశ్నించే స్థాయికి వచ్చారు" అని మండిపడ్డారు.

తనను ఒంటరిని చేసి, పక్కన పెట్టాలని చూస్తున్నారని, అయితే కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానని, చేసిన వారికి తగిన ఫలితం దక్కుతుందని కవిత అన్నారు. కొద్ది నెలల క్రితం కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్

వివరాలు 2లో..

## తెలంగాణ అభివృద్ధి మోడల్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏఐసీసీ తెలంగాణ ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర ఖానాపూర్ చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మీనాక్షి నటరాజన్. తెలంగాణ అభివృద్ధి మోడల్ దేశానికి ఆదర్శమని... నిరుపేదల, అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని అన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని అన్నారు. ఆదివాసీలకు జల్, జంగల్, జమీన్ పై హక్కులు కల్పించింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. నెహ్రూ నుండి రాజీవ్ గాంధీ వరకు ఆదివాసీల సంక్షేమం కోసం పాటుపడ్డారని అన్నారు. ఇందిరా గాంధీ అదివాసీలను ప్రేమించేవారని.. ఇందిరా గాంధీకి పునర్జన్మ ఉంటే అదివాసీగా పుట్టాలని కోరుకున్నారని అన్నారు. రుణమాఫీ చేసి రైతులకు భరోసానించామని అన్నారు. నిరుపేదలు, అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ సర్కార్ పాటుపడుతోందని అన్నారు. పోడు భూములకు హక్కులిచ్చామని.. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం అమలు చేస్తామని అన్నారు మీనాక్షి నటరాజన్.

## కొడాలి నానికి విశాఖ పోలీసుల నోటీసులు.. మరోకేసు నమోదు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కొడాలి నానికి విశాఖ పోలీసులు నోటీసులు జారీ చేశారు. 2024లో ఏయూలా కాలేజీ విద్యార్థిని అంజనప్రియ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో విచారణకు హాజరుకావాలని

వివరాలు 2లో..

## బాపట్ల జిల్లాలో ఘోరం.. క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు మృతి



**పెన్ పవర్ డెస్క్:**బాపట్ల జిల్లా బల్లికురవలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గ్రానైట్ క్వారీలో బండ రాళ్లు మీద పడడంతో ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. పదహారు మంది కార్మికులు

వివరాలు 2లో..

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మెగాస్టార్ చిరంజీవి

- హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో జరిగిన సమావేశం
- మర్యాదపూర్వక భేటీ అని సీఎం కార్యాలయం వెల్లడి
- భేటీ వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేసిన సీఎంఓ
- తెలుగు సినీ కార్మికుల ఫెడరేషన్ సమ్మె పిలుపు నేపథ్యంలో ప్రాధాన్యత
- పరిశ్రమ సమస్యలపై చర్చించారనే ఊహాగానాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఈ భేటీ జరిగింది. చిరంజీవి మర్యాదపూర్వకంగా సీఎంతో సమావేశమై మాట్లాడారంటూ సీఎంఓ కార్యాలయం ఈ భేటీకి సంబంధించిన

వివరాలు 2లో..

## ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు తప్పదు



- సాధారణ కోడింగ్, టెలిసేల్స్ పనులను ఏఐ చేయగలదని తెలిపిన బిల్ గేట్స్
- సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను అధిగమించడానికి ఇంకా సమయం పడుతుందని వెల్లడి
- పారాలీగల్స్, ఎంట్రీ-లెవల్ అకౌంటెంట్ల వంటి ఉద్యోగాలకు ముప్పు తప్పదని అంచనా
- ఏఐ పురోగతి వేగం తనను చాలా ఆశ్చర్యపరిచిందని ఆయన వ్యాఖ్య

వివరాలు 2లో..

## బనకచర్లను అడ్డుకునేందుకు ఎంతవరకైనా వెళతాం

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుంటామన్న తెలంగాణ
- ఇది విభజన చట్టానికి విరుద్ధమంటున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాయలసీమకు నీటి తరలింపును సహించేది లేదని స్పష్టీకరణ
- అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని వెల్లడి
- గోదావరిపై కొత్త ప్రాజెక్టులతో హక్కులు కాపాడుకుంటామని హామీ



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుని తీరుతామని, తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు ఎంతవరకైనా వెళతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం

వివరాలు 2లో..

## యూపీలో ఘోర ప్రమాదం... కాలువలోకి దూసుకెళ్లిన కారు... 11 మంది మృతి



- ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- సరయూ కాలువలోకి దూసుకెళ్లిన భక్తుల వాహనం
- ఈ ఘటనలో 11 మంది దుర్మరణం, నలుగురికి గాయాలు
- మృతుల కుటుంబాలకు సీఎం యోగి రూ. 5 లక్షల పరిహారం
- ప్రధాని మోదీ రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం నాడు ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళుతున్న ఒక వాహనం అదుపుతప్పి కాలువలో పడటంతో 11 మంది

వివరాలు 2లో..

## కేసీఆర్ వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు చేపట్టింది



- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణ
- రాయలసీమను రతనాల సీమ చేస్తానన్న కేసీఆర్‌ను గుర్తుచేసిన వైనం
- తెలంగాణ ప్రయోజనాలను కేసీఆర్ విస్మరించారని తీవ్ర విమర్శ
- నిజామాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి, పొరుగు రాష్ట్రానికి లబ్ధి చేకూర్చేలా కేసీఆర్ వ్యవహరించారని ఆయన తీవ్రంగా విమర్శించారు. "గోదావరిలో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయి, వాటిని ఏపీ వాడుకోవచ్చు" అని గతంలో కేసీఆరే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణను పక్కనపెట్టి, రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆయన మాటలతోనే ఏపీ ప్రభుత్వం

వివరాలు 2లో..

## ఎన్నికల సంఘం పిలుపు... ఢిల్లీకి కేటీఆర్ బృందం



- ఆగస్టు 5న ఈసీఐ సమావేశానికి హాజరుకానున్న బీఆర్ఎస్
- కేటీఆర్ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లనున్న ప్రతినిధి బృందం
- ఎన్నికల సంస్కరణలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై చర్చ
- బీఆర్ఎస్ పెండింగ్ వినతులపైనా చర్చించే అవకాశం
- ఓటర్ల జాబితా సవరణ వివాదం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత

వివరాలు 2లో..

## టాలీవుడ్‌లో సమ్మె సైరన్.. నేటి నుంచి నిలిచిపోనున్న షూటింగ్‌లు!

- నేటి నుంచి టాలీవుడ్‌లో సినిమా షూటింగ్‌లు బంద్
- వేతనాలు 30 శాతం పెంచాలని సినీ కార్మికుల ఫెడరేషన్ డిమాండ్
- పెంచిన జీతాలు రోజువారీగా చెల్లించాలని మరో షరతు
- ఐదేళ్లుగా వేతనాలు పెంచలేదని కార్మికుల ఆరోపణ
- నిర్మాతలతో చర్చలు విఫలమవడంతో సమ్మె నిర్ణయం
- ప్రముఖ సినిమాల చిత్రీకరణపై తీవ్ర ప్రభావం




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మళ్లీ సమ్మె సైరన్ మోగింది. వేతనాల పెంపు కోసం సినీ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో సోమవారం నుంచి టాలీవుడ్‌లో అన్ని సినిమా షూటింగ్‌లు నిలిచిపోనున్నాయి.

వివరాలు 2లో..

## మా ప్రాంతంలోకి అడుగుపెడితే ఊరుకోం.. ట్రంప్‌కు బలూచిస్తాన్ లీడర్ వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్?కు బలూచిస్తాన్ నాయకుడు మీర్ యార్ బలూచ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్తాన్ లో భారీ చమురు, సహజ వాయువు ఫ్యాక్టరీ పెడతామంటున్నారు.. ట్రంప్ ఆ ప్రాంతంలో అడుగుపెట్టవద్దని హెచ్చరించాడు. చమురు, గ్యాస్, లిథియం ,యురేనియం వంటి వనరులు పాకిస్తాన్‌కు చెందినవి కాదు, బలూచిస్తాన్‌కు చెందినవని తేల్చి చెప్పారు. ఇటీవల పాకిస్తాన్‌లో భారీ చమురు ,సహజ వాయువు కర్మాగారాన్ని స్థాపించాలనే తన ఆసక్తి గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించగా..ఈ వ్యాఖ్యలపై స్పందించిన బలూచి

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కొడాలి నానిపై వేలాడుతున్న కేసుల కత్తి..ఎప్పుడైనా అరెస్టంటూ?

మాజీ మంత్రి కొడాలి నాని అరెస్ట్ ఎంతో దూరం లేదని ప్రచారం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తడంతో ఆయన ఎక్కువగా హైదరాబాద్ లోనే ఉంటున్నారు. ఇటీవల కొడాలి నానికి గుండెకు సంబంధించిన ర్జరీ జరిగింది. ఇప్పటికీ ఆయన పూర్తిగా కోలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బయటకు వచ్చినప్పుడు, పోలీస్ స్టేషన్ కు సంతకాలు పెట్టేందుకు వచ్చినప్పుడు కూడా ఆయన బెల్టు తో వస్తున్న ఫొటోలను కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పార్టీ అధికారం కోల్పోవడంతో పాటు గుడివాడ నియోజకవర్గంలోతొలి సారి ఓటమి పాలయి కొడాలి నాని నియోజకవర్గానికి కూడా దూరంగా ఉంటున్నారు.

**తిరుగులేదని భావించి...**

గుడివాడలో గెలుపునకు తనకు తిరుగులేదనుకున్న కొడాలి నానికి మొన్నటి ఎన్నికల్లో తొలిసారి ఓటమి ఎదురయింది. పార్టీలు మారినా గుడివాడ ప్రజలు కొడాలి నానిని అదరించారు. కానీ మొన్నటి ఎన్నికల్లో మాత్రం ఆయనకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నిజానికి ఆ ఓటమిని కొడాలి నాని ఊహించలేదు. గుడివాడ ప్రజలు తనను వదులుకోరని కొడాలి నాని పూర్తి విశ్వాసంతో ఉన్నారు. కానీ అది అతి విశ్వాసం అన్నది తేలిపోయింది. అయితే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఇటు అసెంబ్లీ సమావేశాల్లోనూ, అటు మీడియా సమావేశాల్లోనూ, టీవీ ఇంటర్వ్యూల్లో కొడాలి నాని చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ నేతలు మర్చిపోలేకపోతున్నారు. ఆయనను అరెస్ట్ చేయాల్సిందేనంటూ టీడీపీ సోషల్ మీడియాలో ఎక్కువగా డిమాండ్ వినిపిస్తుంది.

**టీడీపీ నుంచి తొలిసారి గెలిచి...**

2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. గుడివాడలో తనకు తిరుగులేదని భావించిన కొడాలి నాని ప్రత్యర్థులను ఒక ఆటాడుకున్నారు.దీంతో అధికారం కోల్పోయిన తర్వాత కొడాలి నాని అనుచరులు వరసగా అరెస్ట్ అవుతున్నారు. అన్ని కేసులు బయటకు తీసి పోలీసులు వరస బెట్టి అరెస్ట్ లు చేస్తున్నారు. తర్వాత వంతు కొడాలి నానిదేనని అంటున్నారు.

**మరో కేసు నమోదు కావడంతో...**

తాజాగా మాజీ మంత్రి కొడాలి నానిపై మరో పోలీసు కేసు నమోదయింది. విశాఖ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై అంజనా ప్రియ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రబాబుతో పాటు వారి కుటుంబ సభ్యులను కించపర్చే విధంగా పోస్టులు పెట్టారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ మంత్రి కొడాలి నాని పై పోలీసులు కేసు నమోదు చేసి గుడివాడలోని ఆయన ఇంటికి వెళ్లి 41 సీఆర్పీసీ సెక్షన్ కింద నోటీసులు జారీచేశారు. విచారణకు రావాలని కోరారు. అయితే కొడాలి నాని గుడివాడలో లేకపోవడంతో ఇంటివద్ద ఉన్న నాని మనుషులకు ఆ నోటీసులు అందచేసినట్లు తెలిసింది. ఈ కేసులో కొడాలి నానిని అరెస్ట్ చేసే అవకాశం ఎక్కువగా ఉందని కృష్ణా జిల్లాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు తప్పదు

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, దాని ప్రభావంపై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. ఏఐ రాకతో పారాలీగల్స్, ఎంట్రీ-లెవల్ అకౌంటెంట్ల వంటి కొన్ని ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన అంగీకరించారు. అయితే, ఇదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐ ఒక గొప్ప వరంగా మారుతుందని, అనేక రంగాల్లో ఉత్పాదకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం ఏఐ సామర్థ్యాలపై మాట్లాడుతూ, టెలిసేల్స్, టెలి సపోర్ట్ వంటి పనులతో పాటు సాధారణ కోడింగ్ టాస్క్‌లను కూడా ఏఐ సమర్థవంతంగా నిర్వహించగలదని బిల్ గేట్స్ పేర్కొన్నారు. అయితే, అత్యంత సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి ఏఐ ఇంకా చేరుకోలేదని స్పష్టం చేశారు. ఈ స్థాయికి చేరడానికి ఒకట్రెండు సంవత్సరాలు పడుతుందా లేక దశాబ్ద కాలం పడుతుందా అనే దానిపై నిపుణుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఆయన వివరించారు.ఏఐ పరిశోధనలో కనిపిస్తున్న వేగవంతమైన పురోగతి తనను ఆశ్చర్యపరిచిందని గేట్స్ తెలిపారు. ముఖ్యంగా అల్ప ఆదాయ దేశాలలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాల్లో ఉత్పాదకతను పెంచడానికి ఏఐకి అపారమైన అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సరైన పద్ధతిలో వినియోగిస్తే, ఏఐ మానవాళి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. గతంలో పరిశ్రమల్లోకి రొబోటిక్ ఆర్మ్స్ వచ్చినప్పుడు బ్లూ-కాలర్ ఉద్యోగాలపై ఎలా ప్రభావం పడిందో, ఇప్పుడు ఏఐ రాకతో వైట్-కాలర్ ఉద్యోగాలపై అలాంటి ప్రభావమే ఉంటుందని ఆయన పోల్చారు. ఈ మార్పులకు అనుగుణంగా ప్రపంచం సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న లొల్లి...

## కవిత, జగదీశ్ రెడ్డి మధ్య మాటల తూటాలు!

- మొదటి పేజీ తరువాయి

అయిన నాటి నుంచి కవిత అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. "కేసీఆర్ ఒక దేవుడు, కానీ ఆయన చుట్టూ రాక్షసులు చేరారు" అని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**కవిత వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి స్పందన**

కవిత చేసిన తీవ్ర వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కూడా ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. "నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. కేసీఆర్ శత్రువులైన రేవంత్, రాధాకృష్ణ లాంటి వారు నా గురించి మాట్లాడిన మాటల్ని ఆమె మరొక్కసారి వల్లె వేసేందుకు చేసిన ప్రయత్నానికి నా సానుభూతిని తెలియజేస్తున్నా" అంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# ఎన్నికల సంఘం పిలుపు... ఢిల్లీకి కేటీఆర్ బృందం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీ పర్యటనకు సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఏర్పాటు చేసిన కీలక సమావేశంలో పాల్గొనేందుకు ఈ బృందం ఢిల్లీకి వెళ్లనుంది. రాజకీయ పార్టీలతో ఈసీఐ నిర్వహించనున్న ఈ భేటీ ఆగస్టు 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరగనుంది.

ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహల్ అధికారికంగా లేఖ పంపారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ద్వారా కూడా బీఆర్ఎస్ అధ్యక్షుడికి సమాచారం అందించారు. కేటీఆర్ నాయకత్వంలోని ఈ బృందంలో పార్టీ సీనియర్ నేతలు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండనున్నారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేత కేఆర్ సురేశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు.

ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్నికల సంస్కరణలు, వివిధ పార్టీలు సమర్పించిన వినతులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) వంటి కీలక అంశాలపై చర్చ జరగనుంది. బీఆర్ఎస్ పార్టీ గతంలో ఇచ్చిన వినతులు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా బిహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) డ్రైవ్‌పై వివాదం నడుస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం గమనార్హం. ఇదే అంశంపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తూ, చర్చకు పట్టుబడుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ వ్యవహారంపై ఆగస్టు 5న బెంగళూరులో నిరసన చేపట్టనున్నారు. ఈ రాజకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ బృందం ఈసీఐ సమావేశానికి హాజరుకావడం ఆసక్తికరంగా మారింది.

# బనకచర్లను అడ్డుకునేందుకు ఎంతవరకైనా వెళతాం

- మొదటి పేజీ తరువాయి

చేశారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి పూర్తిగా విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

రామగుండం నియోజకవర్గంలో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు ఉద్దేశించిన బనకచర్ల ప్రాజెక్టును తమ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, దీనిని నిలువరించేందుకు అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరిస్తామని ఆయన వివరించారు. ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఈ విషయంపై చర్చించామని, అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని తేల్చిచెప్పారు.

తెలంగాణ జల హక్కులను కాపాడటంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. గోదావరి నదిపై ఇచ్చంపల్లితో పాటు ఇతర కొత్త ప్రాజెక్టులను నిర్మించి, గోదావరి బేసిన్‌లోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళితే, దానిని కచ్చితంగా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై పూర్తి వివరాలతో ఈ నెల 30న ప్రజాభవన్‌లో ఒక ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# మా ప్రాంతంలోకి అడుగుపెడితే ఊరుకోం.. ట్రంప్‌కు బలూచిస్తాన్ లీడర్ వార్నింగ్

- మొదటి పేజీ తరువాయి

తన సోషల్ మీడియా ప్లాట్ ఫాం %శ%లో ట్రంప్ కు వార్నింగ్ ఇస్తూ ఓ పోస్ట్ షేర్ చేశారు. ఆ ప్రాంతంలోని విస్తారమైన చమురు,ఖనిజ వనరులున్న మాట నిజమే.. ట్రంప్ వేసినా అంచనా కరెక్టే.. అయితే ఈ వనరుల భౌగోళిక యాజమాన్యం గురించి ట్రంప్ ప్రభుత్వం తప్పుదారి పట్టిందని మీర్ యార్ బలోచ్ సెటైరికల్ రాశారు. ట్రంప్ కు పాకిస్తాన్ తప్పుడు సమాచారం అందించింది.. ముమ్మాటికీ ఆ వనరులున్న ప్రాంతం బలూచిస్తాన్ లోనిది అని మీర్ యార్ బలూచ్ స్పష్టం చేశారు.

చమురు, సహజ వాయువు, రాగి, లిథియం, యురేనియం ,అరుదైన భూమి ఖనిజాల నిల్వలు పాకిస్తాన్ పంజాబ్ ప్రాంతంలో లేవు..కానీ అవి పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన స్వతంత్ర దేశం బలోచిస్తాన్‌లో ఉన్నాయని బలూచ్ చెప్పారు. రాజకీయ ,ఆర్థిక లాభంకోసం బలూచిస్తాన్ సంపదను కొల్లగొట్టేందుకు చేసిన ఉద్దేశపూర్వక ప్రయత్నం అని బలూచ్ అన్నారు.

# టాలీవుడ్‌లో సమ్మె సైరన్.. నేటి నుంచి నిలిచిపోనున్న షూటింగ్‌లు!

- మొదటి పేజీ తరువాయి

తమ డిమాండ్లు నెరవేర్చే వరకు విధులకు హాజరుకాబోమని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఫెడరేషన్ నాయకులు తమ ప్రధాన డిమాండ్లను మీడియా ముందుంచారు. కార్మికుల వేతనాలను తక్షణమే 30 శాతం పెంచాలని వారు కోరుతున్నారు. అంతేకాకుండా, పెంచిన వేతనాలను ఏ రోజుకు ఆ రోజే చెల్లించాలని మరో కీలకమైన షరతు విధించారు. ఈ నిబంధనలకు అంగీకరించిన నిర్మాతలకు చెందిన సినిమా పనుల్లో మాత్రమే తాము పాల్గొంటామని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఇప్పటికే తెలుగు ఫిలిం ఛాంబర్ కు సమ్మె నోటీసు అందజేశారు.పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రస్తుత వేతనాలతో జీవించడం కష్టంగా మారిందని, అందుకే వేతనాల పెంపు తప్పనిసరి అని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలు దఫాలుగా నిర్మాతలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకే మొగ్గు చూపినట్లు తెలిపారు.ప్రస్తుతం టాలీవుడ్‌లో పలు భారీ బడ్జెట్ చిత్రాలతో పాటు అనేక సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. ఈ ఆకస్మిక సమ్మె కారణంగా షూటింగ్‌లతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఆగిపోనున్నాయి. దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సినీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సమస్య పరిష్కారానికి నిర్మాతల మండలి, ఫెడరేషన్ మధ్య త్వరలోనే చర్చలు జరిగే అవకాశం ఉంది.

## కేసీఆర్ వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు చేపట్టింది

- మొదటి పేజీ తరువాయి

ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన జనహిత పాదయాత్రలో భాగంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మెగాస్టార్ చిరంజీవి

- మొదటి పేజీ తరువాయి

వీడియోను 'ఎక్స్' ప్లాట్‌ఫారమ్‌లో పోస్టు చేసింది. కాగా, చిత్ర పరిశ్రమలోని సమస్యలపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డిని చిరంజీవి కలిశారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా, తెలుగు సినీ కార్మికుల ఫెడరేషన్ సమ్మెకు పిలుపునిచ్చిన సమయంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# యూపీలో ఘోర ప్రమాదం... కాలువలోకి దూసుకెళ్లిన కారు... 11 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన గోండా జిల్లాలో జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు.

మోతిగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహగావ్ గ్రామానికి చెందిన 14 మంది ఒక బొలెరో వాహనంలో ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి పూజల కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో వీరి వాహనం సరయూ కాలువలోకి దూసుకెళ్లింది. వాహనం నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొందరు గ్రామ పెద్దకు విషయం చేరవేశారు.సమాచారం అందుకున్న ఇటియాథోక్ పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నీటిలో మునిగిపోయిన వాహనం నుంచి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో పురుషులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దుర్ఘటనపై జిల్లా ఎస్పీ వినీత్ జైస్వాల్ మాట్లాడుతూ, "ఆలయానికి వెళుతుండగా బొలెరో వాహనం కాలువలో పడిపోవడంతో 11 మంది మరణించారు. స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురిని రక్షించి జిల్లా ఆసుపత్రికి తరలించాం" అని తెలిపారు.ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## కొడాలి నానికి విశాఖ పోలీసుల నోటీసులు.. మరోకేసు నమోదు

- మొదటి పేజీ తరువాయి

ఈ నోటీసులలో ఆదేశించారు.వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన కొడాలి నాని మూడేళ్ల పాటు చంద్రబాబు, లోకేశ్ లను అసభ్యకరరీతిలో దుర్భాషలాడారని అంజనప్రియ ఆరోపించారు. ఓ మహిళగా ఆ తిట్లను భరించలేకపోయానని 2024లో విశాఖ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐటీ యాక్టు U/s 353(2), 352, 351(4) సెక్షన్ల కింద సి.ఐ రమణయ్య అప్పట్లో కేసు నమోదు చేశారు.తాజాగా ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆదివారం కృష్ణా జిల్లా గుడివాడలోని కొడాలి నాని ఇంటికి వెళ్లిన పోలీసులు విచారణకు రావాలని 41 సీఆర్‌పీసీ నోటీసులు అందజేశారు.

## బాపట్ల జిల్లాలో ఘోరం.. క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు మృతి

- మొదటి పేజీ తరువాయి

క్వారీలో పని చేస్తుండగా అకస్మాత్తుగా బండరాళ్లు కిందపడ్డాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. దీంతో ఆరుగురు కార్మికులు రాళ్ల కింద పడి నలిగిపోయారని వివరించారు. చనిపోయిన వారంతా ఒడిశాకు చెందిన వారని అధికారులు వివరించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# నేడు జీకే వీధి మండల కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో నేడు (ఆగస్టు 4, సోమవారం) ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం జరగనుంది.ఈ సమావేశంలో భాగంగా ముందుగా వీధి లైట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం "బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ" అనే అంశంపై మండల స్థాయి సమావేశం జరుగుతుంది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాడేరు శాసన సభ్యులు, అల్లూరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు హాజరవుతారు. మండల స్థాయిలోని కీలక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమక్షంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, పార్టీ బలోపేతంపై చర్చ జరగనుంది.సమావేశాన్ని విజయవంతం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని పార్టీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ లోతా దేముడు ఈ కార్యక్రమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పార్టీ ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, రీమేల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులు వంతల చంటిబాబు, పాంగి చందర్ రావు, షేక్ దావీదు, నారాయణ, రామూర్తి తదితరులు సమావేశ ఏర్పాట్ల పర్యవేక్షణ చేస్తున్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీపీ,



జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర-జిల్లా నాయకులు, నూతనంగా నియమితులైన మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అన్నదాతలకు అండగా పీఎం కిసాన్ సన్మాన్ నిధి

- రైతుల ఖాతాల్లో రూ.2000 జమ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 3:**దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరణలో ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ సన్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు కేంద్ర ప్రభుత్వం 20వ విడత పెట్టుబడి ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. ఈ పథకం కింద రూ. 2000 మంజూరై, రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమైంది.ఈ పథకం ద్వారా సంవత్సరానికి రూ.6000 మూడు విడతలుగా రైతులకు అందిస్తూ, వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించుకునేలా ప్రభుత్వం చేపట్టిన ఈ ముందడుగు ఎంతో అవసరమైనదిగా భావిస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా అదనంగా రూ.5000 చొప్పున ఇవ్వడంతో రైతులకు ఈసారి మొత్తం రూ.7000 లాభం చేకూరనుంది.వ్యవసాయం చేసుకునే ప్రతి రైతు ఈ పథకం ప్రయోజనాన్ని పొందుతూ, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దుర్వినియోగం జరగకుండా చూసుకోవాలని గూడెం కొత్తవీధి మండలం బీజేపీ మండల అధ్యక్షులు కాకూరు శేఖర్ పిలుపునిచ్చారు.రైతన్నల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తాయని, పీఎం కిసాన్ నిధి పథకం అన్నదాతల సురక్షకు నిలువుదల అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# నేడు జీ.కే.వీధిలో ఆదివాసి దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం

- నేడు ఉదయం 11 గంటలకు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 3:** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా, ఈ నెల 9 ఆగస్టు 2025న నిర్వహించబోయే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు, ఈ రోజు (04-08-2025, సోమవారం) ఉదయం 11 గంటలకు, జీ.కే.వీధి మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయబడింది.ఈ సమావేశానికి మండలంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాల నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు, పీసా కమిటీ సభ్యులు, మోటార్ యూనియన్ నేతలు, వర్తక వాణిజ్య ప్రతినిధులు, కార్మిక కర్షక మిత్రులు, మహిళలు, యువత అందరూ తప్పక హాజరై, ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమాన్ని ఘనవంతంగా చేయాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, జీ.కే.వీధి మండలం వారు కోరుతున్నారు.అందరి సమన్వయంతో జరిగే ఈ సమావేశం గిరిజనుల సాంస్కృతిక, సామాజిక ప్రాధాన్యాన్ని చాటేలా ఉండనుంది. అందుకే ప్రతి ఒక్కరు తమ పాత్రను నిర్వర్తిస్తూ పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# పంచాయతీ నిధుల విడుదల కోసం చలో విజయవాడ

- ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల భారీ నిరసన
- రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కుందేరి రామకృష్ణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 3:**కేంద్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి విడుదల చేసిన 1,121 కోట్ల నిధులను ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచులు ఆగస్టు 5వ తేదీన "చలో విజయవాడ" కార్యక్రమం నిర్వహించనున్నారని రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు దామనాపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ తెలిపారు."గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలి. సర్పంచులకు గౌరవ వేతనం పెంచాలి. ఉపాధి హామీ పథకం పనులను పంచాయతీల ద్వారానే నిర్వహించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి," అని సర్పంచు పేర్కొన్నారు. సర్పంచులు తెలిపిన వివరాల ప్రకారం, నిధుల లభ్యత లేక పారిశుద్ధ్య పనులు, బ్లీచింగ్, కాలువల పూడికతీత వంటి పనులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీ కార్మికులు జీతాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోయారు.ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తక్షణం స్పందించి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, నిధుల జమపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఇంకా ఏమన్నా ఆలస్యం జరిగితే...
ఐదో తారీఖున జరిగే నిరసన అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని సర్పంచుల నేతలు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# అప్పుడే పుట్టిన చిన్నారులకు ముర్రుపాలు పాలతోని సంపూర్ణ ఆరోగ్యం

కేజీహెచ్ సూపరిం టెండెంట్ ఐ. వాణీ

**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 3 :**అప్పుడే పుట్టిన చిన్నారులకు ముర్రుపాలు పాలతోని సంపూర్ణ ఆరోగ్యమని కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ వాణీ అన్నారు. ఈమేరకు తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎ స్,ఆరోగ్య శాఖ సాయుక్త ఆధ్వర్యంలో ఆది వారం ఉదయం ఆర్ కె బీచ్ కాళీమాత ఆల యం వద్ద పెద్ద ఎత్తున అంగన్వాడీ లు ప్లకార్డ్స్, బ్యానర్ లు ప్రదర్శిస్తూ "తల్లిపాలు ముద్దు - డబ్బాపాలు వద్దు" అనే నినాదంతో మానవ హారం నిర్వహించారు. కార్య క్రమానికి హాజరైన కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ వాణీ మాట్లాడా రు బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు తల్లిపాలు శిశువును న్యుమోనియా అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడ తాయని తెలిపారు పిల్లల మేధస్సును మెరుగు పరచడంలో తల్లి పాలు సహాయపడతాయ న్నారు



ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె వి రామలక్ష్మి మాట్లాడుతూ తల్లి పసుపు రంగులోని చిక్కటి పాలు (ముర్రుపాలు) బిడ్డకు అమఅతంలాంటి వి అని వివరించారు తల్లి పాలు సంపూర్ణ ఆహారం అని అన్నారు వీటిలో బిడ్డకు అవస రమైన అన్ని పోషకాలు ఉంటాయనీ అలాగే వ్యాధి నిరోధక శక్తి కలు గుతుందని చెప్పారు.
ఈ కార్యక్రమంలో సిడీపీఓ లు కె నీలిమ,డి. నీల వేణి,ఎం.శ్రీదేవి,ఝాన్సీ రాణి, సంతోషి,శ్రీలత సెక్టార్,సూపర్ వైజర్ లు పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్కి ఘన స్వాగతం



- దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 3 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల,ఆహారం మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పార్టీ %ూాజ% ఛైర్మన్, పెద్దలు నాదెండ్ల మనోహర్ కి విశాఖపట్నం విమానా శ్రయంలో జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షు లు , దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా విశాఖ నగరానికి రాష్ట్ర మంత్రి విచ్చేసారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రూరల్ అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు ఎమ్మెల్యేలు విజయ్, మాధవి, వివిధ హోదాల లో ఉన్న జనసేన పార్టీ శ్రేణులు ,వీర మహిళలు పాల్గొన్నారు.

# ఐఏఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ

విద్య అనేది మార్గం- సేవే లక్ష్యం

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దొడ్డికొండ గ్రామంలో గల ఒక యువకుని భవిష్యత్తును వెలుగులోకి తీసుకువచ్చే ముఖ్యమైన సంఘటన ఆదివారం జరిగింది. గూడెం కొత్త వీధి మండల డిప్యూటీ తాహసిల్దార్ దుమంతి సత్యనారాయణ దొడ్డికొండ గ్రామానికి చెందిన వసుపరి దుర్గాప్రసాద్ కు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. యువకుడు గూడెం కొత్తవీధి పెన్ పవర్ రిపోర్టర్ మాదిరి చంటిబాబు ను స్టడీ మెటీరియల్ కొరకు తెలపగా ఆయన డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు విషయం తెలియజేశారు. రిపోర్టర్ మాదిరి చంటిబాబు విజ్ఞాపన మేరకు దుమంతి సత్యనారాయణ స్వయంగా ముందుకు వచ్చి తన బావగారైన లొంజా బాలగంగాధర్ తిలక్, తన కుమారుడు దుమంతి భవాని ఓంకార్ సహకారంతో ఐఏఎస్ స్టడీ మెటీరియల్ ను దుర్గాప్రసాద్ కు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దుమంతి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యను నమ్ముకున్న వారు ఎప్పుడూ మోసపోలేరు. ఈ పుస్తకాలు నిన్ను ఉన్నత స్థాయిలో చేర్చుతాయి అని నమ్మకం ఉంది. నువ్వు భవిష్యత్తులో స్థిరపడిన తర్వాత ఈ సమాజానికి తిరిగి ఏదో ఒక రూపంలో సేవ చేయాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. విద్యను ఆశ్రయిస్తే జీవితంలో తిరిగే ఉండదని కష్టపడి చదివి భవిష్యత్తులో స్థిరపడాలని




అన్నారు.ఈ కార్యక్రమంలో మాదిరి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం జివిఎంసి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం .





- విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు.
- జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్.

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 03 :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాల యాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 ఆగస్టు 4వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబ డునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరా వు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.
నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి,దీపాలు, హారికల్చ ర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ఆగస్టు 4వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరా వు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

# 87వ వార్డ్ లో నూతనంగా వేసిన సీసీ రోడ్ ను పరిశీలన




**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 03**
జివియంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో నూతనంగా వేసిన సీసీ రోడ్డును పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తుందని ప్రజల ఆలోచనలకు తగ్గట్టు వారికి ఏ అభివృద్ధి కావాలో ఆ పనులు మాత్రమే చేయడం జరుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సాగి విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, జన సైనికులు కర్రి నర్సింగరావు, తుట్టా పైడ్రాజు, సందర్ సునీల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు



**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 03 :**వై సి పి క్యాంప్ ఆఫీస్ లో ప్రపంచ స్నేహితులు దినోత్సవం సందర్భంగా వై సి పి గాజువాక ముఖ్యనాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ సంబరాలు చేసికోవటం జరిగింది. అనంతరం ఫ్రండ్స్ షిప్ బెండ్స్ కట్టుకొని స్వీట్లు పంచుకోవటం జరిగింది అనంతరం నాయకులు మాట్లాడుతూ.
కుల మాత భేదం చూడనిది
పేద ధనిక బేధంలేనిది
బంధుత్వం కన్నా గొప్పది స్నేహం మనిషి కన్నా మనుసు మిన్న,ఆవేశం కన్నా ఆలోచన మిన్న,ప్రాణం కన్నా త్యాగం మిన్న కానీ అన్నిటి కన్నా ఎల్లా కాలం ఉండే మన స్నేహం మిన్న అని అన్నారు.
ఈ కార్యక్రమం లో గాజువాక ఎస్సి అధ్యక్షుడు మార్థుపూడి పరదేశి,64 వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాస్ రెడ్డి,75 వ అధ్యక్షులు గోందేశీ శ్రీనివాస్ రెడ్డి,గోందేశీ వెంకటరమణ రెడ్డి సంపంగి ఈశ్వర్ రావు,పిట్టా రెడ్డి,ఎస్.రాజారావు,వాసా అప్పలరెడ్డి,ములకలపల్లి వెంకటేష్,మంగు నాయుడు.పిట్టా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందికి సన్మానించిన కోడిసింగి గ్రామస్తులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం లక్కవరపేట పంచాయతీ సచివాలయంలో గత ఐదేళ్లుగా ప్రజలకు సేవలు అందించిన సచివాలయం సిబ్బందిని కోడిసింగి గ్రామంలో బోండ్ల చిరంజీవి, మచ్చుల కళ్యాణ్, సుంకరి శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సచివాలయం ఉద్యోగులు సుర కత్తి రామ్, కోటి, నిర్మల, ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులం అయినా గ్రామస్తులతో మాకు ఏర్పడిన అనుబంధం కుటుంబ సంబంధాల మాదిరిగానే ఉంది. ఈ గ్రామం మా ఉద్యోగ జీవితానికి తొలిమెట్టు. ఇక్కడి ప్రజల ఆత్మీయత మమ్మల్ని మర్చిపోలేని అనుభూతుల్లో ముంచెత్తింది అని భావోద్వేగంగా పేర్కొన్నారు. బదిలీపై వెళుతున్న సమయంలో వారు కన్నీటి పర్యంతం అవటం భావోద్వేగాలకు గురిచేసింది. సిబ్బందికి జ్ఞాపకాలు అందజేసి, దుస్సాల్వలతో సన్మానించారు. ఇవాళ విడిపోవలసి రావటం బాధగా ఉన్న, వృత్తిరీత్యా తప్పదు కనుక భవిష్యత్తులో వృత్తిరీత్యా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ మరింత మంచి సర్వీస్ అందించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామమునసాబు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక యువత, మహిళా సంఘాల నాయకులు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెన్షన్స్ డబ్బులు దొంగిలించిన దుండగులు అరెస్ట్








- 15 లక్షల 62వేలు డబ్బులు, మూడు ఆండ్రాయిడ్ మొబైల్స్, ఒక స్కూటీ, రెండు కత్తులు నిందితుల నుండి స్వాధీనం.
- కేసును చేదించిన పోలీసు సిబ్బందికి రివార్డులు అందించిన జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్.
- ముంచంగిపుట్టు ఎస్సై జే రామకృష్ణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 03.** అల్లూరి జిల్లాలో పెన్షన్స్ డబ్బులు దొంగిలించిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించమని, వారి వద్ద నుండి 15 లక్షల 62 వేల రూపాయల డబ్బులు, మూడు ఆండ్రాయిడ్ మొబైల్స్, రెండు కత్తులు, ఒక స్కూటీ స్వాధీనం స్వాధీనం చేసుకున్నామని ముంచంగిపుట్టు ఎస్సై జే రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 31వ తారీఖున సాయంత్రం ఐదు గంటల సమయంలో పెదబయలు మండలం, బొండపల్లి పంచాయతీకి చెందిన వెల్ఫర్ అసిస్టెంట్ కట్టారి మచ్చేబాబు ఆగస్టు ఒకటి దినాన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ ఉన్నందున, పెదబయలు స్టేట్ బ్యాంకు నుండి 15 లక్షల 62వేల రూపాయలను తీసుకుని పింఛన్ల పంపిణీ కొరకు ఆయన గ్రామమునకు వెళుచుండగా మార్గమధ్యలో బంగారుమెట్ట సమీపంలో గుర్తుతెలియని దుండగులు బండిని ఆపి మారణ ఆయుధాలు (రెండు కత్తులు)తో బెదిరించి మచ్చేబాబు దగ్గర ఉన్న 15 లక్షల 62 వేల రూపాయల డబ్బులతో ఉన్న బ్యాగును తీసుకుని వాళ్ళు వచ్చినట్టువంటి స్కూటీపై పారిపోయారన్నారు. అంతట వెల్ఫేర్ అసిస్టెంట్ తోపాటు పెదబయలు ఎంపీడీవో వెంటనే ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని, దీంతో ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి పై ఉన్నత అధికారులకు విషయము వివరించమన్నారు. దీనిపై తక్షణమే స్పందించిన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలతో డి.ఎస్.పి షేక్ సహబాజ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందిని కొన్ని బృందాలుగా ఏర్పాటుచేసి దుండగుల కొరకు గాలించమన్నారు. ఈ సమయంలో రెండవ తారీఖున ముంచంగిపుట్టు మండలం జోలపుట్టు గ్రామ శివారులో ముగ్గురు వ్యక్తులు అధిక మొత్తంలో డబ్బులు పంచుకున్న సమయంలో జి మాడుగుల సిఐ బోల శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బందితో ఆ ప్రదేశమునకు వెళ్లి చాకచక్యంగా ముగ్గురు దుండగులను పట్టుకున్నామన్నారు. ఆ ముగ్గురుని ప్రశ్నించగా జూలై 31 వ తారీకునా వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద నుండి ఆయనను బెదిరించి బ్యాగును తీసుకొని పోయిన ఆ సొమ్మును పంచుకుంటున్నామని దుండగులు తెలిపారన్నారు. వారి దగ్గర ఉన్న 15 లక్షల 62 వేల రూపాయల డబ్బులు, మూడు ఆండ్రాయిడ్ మొబైల్స్, ఒక స్కూటీ (బేరింగ్ నెంబర్ ఓడి 10 జెడ్ 1798), రెండు కత్తులను జి మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ తో కలసి వాటిని స్వాధీనం చేసుకున్న మన్నారు. దొంగతనానికి పాల్పడిన ముగ్గురు ముద్దాయిలు ఒడిస్సా రాష్ట్రం కు చెందిన వారన్నారు. వారిలో 1, సంతోష్ కుమార్ మహాపాత్ర, (వయస్సు 28), (తండ్రి కృష్ణచంద్ర మహా పాత్ర), గొల్లూరు గ్రామము, నందపూర్ బ్లాక్, కొర్రపుట్ జిల్లా, ఒడిస్సా. 2, వికాస్ కొర (వయసు 25), (తండ్రి నవీన్ కొర), బాపూజీ నగర్, జైపూర్ బ్లాక్, కొర్రపుట్టు జిల్లా, ఒడిస్సా. 3, స్వప్నిల్ దురై (వయస్సు 19), (తండ్రి గోవర్ధన్ దురై) కూడా గ్రామము, బలియా పంచాయతీ, జైపూర్ బ్లాక్, కొరపుట్ జిల్లా, ఒడిస్సా గా గుర్తించడం జరిగిందన్నారు. ముగ్గురు వ్యక్తులు తక్కువ కాలంలోనే ఎక్కువ డబ్బులు ఈజీగా సంపాదించాలని ఉద్దేశంతో ఈ దొంగతనం చేశారన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పోగొట్టుకున్న 15 లక్షల 62 వేల రూపాయలు డబ్బులు పూర్తి మొత్తంలో స్వాధీన పరుచుకున్నామని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న డబ్బులు, ముద్దాయిలను కోర్టులో హాజరు పరిచి ముద్దాయిలను రిమాండ్ కు తరలించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సిసిటివి ఫుటేజ్ ఏర్పాటు చేయడం జరిగిందని, దొంగతనాలు నివారణకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందజేసి సహకరించాలని కోరారు. ఈ కేసును చేదించిన పోలీసు సిబ్బందిని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ అభినందించి రివార్డులు అందజేశారని ఎస్సై రామకృష్ణ తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు తీసుకున్న వారిలో జి మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు, ముంచంగిపుట్టు ఎస్సై జే రామకృష్ణ, అరకు ఎస్సై జి గోపాలరావు, ఎస్ రవికుమార్ (ముంచంగిపుట్టు పీఎస్), ఎం శ్రావణ్ కుమార్ (ముంచంగిపుట్టు పిఎస్), సిహెచ్ భరత్ (ముంచంగిపుట్టు పిఎస్), కే సంజీవ్ (ముంచంగిపుట్టు పిఎస్), ఆర్ రమేష్ (పెదబయలు పిఎస్), కె నారాయణ రావు (అరకు పిఎస్), పి రామ్మూర్తి, (అరకు పిఎస్), సిహెచ్ రామమూర్తి (పెద్దబయలు పిఎస్) సిబ్బందులు ఉన్నారని ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు.

# మఠాలకు నోటీసులివ్వడం హిందూ ధర్మాన్ని అవహేళన చేయడమే

- వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం
- తిరుపతి లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన భూమన కరుణాకర్ రెడ్డి
- మఠాలు హిందూ ధర్మాన్ని ప్రచారం చేస్తూ, పరిరక్షిస్తున్నాయి
- వాటికి నోటీసులివ్వడంపై సీఎం, డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలి
- నిషేధిత, అనుమానిత వస్తువులు, మారణాయుధాలతో వారికేం పని.?
- సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలనడం మఠాధిపతులును అనుమానించడమే
- స్పష్టం చేసిన భూమన కరుణాకర్‌రెడ్డి




**తిరుపతి: పెన్ పవర్, ఆగస్టు 03** కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ చర్యలు చూస్తుంటే హిందూ ధర్మ పవిత్రతను రోజురోజుకీ మసకబార్చేలా ఉన్నాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతిలోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..హిందూ ధర్మాన్ని ప్రచారం చేసి, పరిరక్షించే తిరుమల కొండపై ఉన్న మఠాలకు నోటీసులు ఇవ్వడమంటే మఠాధిపతులను అవమానించడమేనని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతోపాటు నోటీసుల్లో మారణాయుధాలు, నిషేధిత వస్తువులు, పేలుడు పదార్థాలు రాకుండా తనిఖీ చేయాలని చెప్పడం చూస్తుంటే మఠాల నిర్వహణ మీద అనుమానాలు వ్యక్తం చేయడమే అవుతుందని స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తామని, హిందూ ధర్మ పరిరక్షణకు తామే బ్రాండ్ అంబాసిడర్లమని ప్రచారం చేసుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దీనికి సమాధానం చెప్పాలి. అత్యంత పవిత్రంగా స్వామి వారికి సేవ చేయడంలోనే జీవితాన్ని గడిపేస్తున్న మఠాలకు నోటీసులిచ్చిన టీటీడీ, ధనికుల ఆధ్వర్యంలో నడుస్తున్న గెస్ట్ హౌస్‌లకు ఇవే నోటీసులు ఎందుకు ఇవ్వలేదో స్పష్టం చేయాలని భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### ఆయన ఇంకా ఏమన్నారంటే...

మఠాలను సీజ్ చేస్తారా ?

శ్రీవేంకటేశ్వర స్వామి నిలయమైన అత్యంత పవిత్ర తిరుమల క్షేత్రంగా విరాజిల్లుతున్నకొండమీద అనేక మఠాలను దశాబ్దాల క్రితం నెలకొల్పడం జరిగింది. శ్రీమహావిష్ణువే స్వయంభువుగా వెలసిన ఆ దివ్యక్షేత్రం పవిత్రతను కాపాడుతూ స్వామి వారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో ఈ మఠాల పాత్ర విశిష్టమైనది. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తూ దాదాపు 32 మఠాల వరకు కొండ మీద కొనసాగుతుండగా వాటికి కూటమి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులను తీవ్రంగా అవమానించడమే. ఆ నోటీసుల్లో %-%మీరు సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలి. మఠానికి ఒకవైపు మాత్రమే తలుపులు పెట్టుకోవాలి. అన్ని వైపులా ద్వారాలను ఏర్పాటు చేసుకోవడం కుదరదు. రూఫ్ గార్డులు పెట్టుకోవాల%-%ని పేర్కొన్నారు. కాంపౌండ్ నలువైపులా అన్ని వైపులా, అన్ని ఫ్లోర్ కారిడార్లు కనిపించేలా, ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్, కారిడార్, మెట్లు, లిఫ్టు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులిచ్చారు. ఇదంతా ఒక ఎత్తయితే మఠాలకు జారీ చేసిన నోటీసుల్లో మారణాయుధాలు, నిషేధిత వస్తువులు, పేలుడు పదార్థాలు రాకుండా తనిఖీ చేయాలని నోటీసులు ఇచ్చారు. సీసీ కెమెరాల బ్యాకప్ మూడు నెలలపాటు ఉండేలా చేసుకోవాలని సూచించిన పోలీసులు, తాము అడిగినప్పుడు ఆ సమాచారాన్నంతా తప్పనిసరిడా అందజేయాలని ఆదేశించారు. మఠానికి సందర్శించే ప్రతి వ్యక్తి వివరాలు రాసి పెట్టుకోవాలని ఆ వివరాలను ఐడీ కార్డులతో సహా పోలీసులు అందజేయాలని నోటీసుల్లో వెల్లడించారు. ఈ నిబంధనలు అనుసరించకపోతే పోలీస్ పబ్లిక్ సేఫ్టీ మెజర్స్ యాక్ట్ 2013 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మఠాలను హెచ్చరించారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ మొదటిసారి తప్పు చేస్తే రూ.5వేల జరిమానా విధిస్తామని రెండోసారి ఉల్లంఘిస్తే డీఎస్పీ ఏకంగా మఠాన్నే మూసేస్తారని చెప్పారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ సంతకంతో కూడిన నోటీసులు అన్ని మఠాలకు పంపారు.

### ఇదే నోటీసులు గెస్ట్ హౌస్‌లకు ఎందుకివ్వలేదు?

హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి నడుంబిగించామని ఊదరగొట్టిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు ఈ నోటీసులకు ఏం సమాధానం చెబుతారు..? మఠాధిపతులు ఆధీనంలో నడిచే సంస్థలకు మారణాయుధాలు, నిషేధిత వస్తువులు తేవద్దు అంటూ హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేయడాన్ని ఎలా సమర్థించుకుంటారా.? ఇదే తిరుమల కొండ మీద వందలాది ధనవంతులతో నడుస్తున్న గెస్ట్ హౌస్‌లు, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పీఏసీలకు ఇలాంటి నోటీసులు ఎందుకివ్వలేదు.? పరమ నిష్టాగరిష్టంగా ఉండి స్వామివారికి సేవ చేస్తూ హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తున్న పీఠాధిపతులకు నోటీసులు ఇవ్వడాన్ని ఈ ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుంది.?

సాంప్రదాయ బద్దంగా మడికట్టుకుని కనీసం ఆహారం కూడా తీసుకోకుండా ప్రయాణాన్ని ప్రారంభించి ఆకలేసినప్పుడు కేవలం అటుకులను మాత్రమే అతి పరిమితంగా తింటూ దీక్షగా యాత్ర చేసుకుంటూ స్వామివారి దర్శనం కోసం వచ్చే సాధువుల మీద ఈ దాష్టీకం ఏంటి.? హైందవ ధర్మం మీద ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడి కాక ఇంకేమిటి.? దేశ వ్యాప్తంగా మహా మహా క్షేత్రాలకు సంబంధించిన పీఠాధిపతులంతా వేంకటేశ్వరుని స్మరించి సేవించడానికి ఇక్కడ మఠాలు నిర్మిస్తే వారికి నోటీసులు ఇవ్వడం హిందూ ధర్మాన్ని చంద్రబాబు తన ఇనుప పాదాలతో అణచివేస్తున్నారు. సీఎం చంద్రబాబు తక్షణం దీనిపై స్పందించాలి.

### బ్రిటీష్ పాలకుల కన్నా ఘోరంగా...

ఈ నోటీసులను శ్రీవైష్ణవానికి జరుగుతున్న ఘోర అవమానంగా చూడాలి. బ్రిటీష్ పాలకులు, ఆర్కాట్ నవాబుల కన్నా దారుణంగా బీఆర్ నాయుడు నేతృత్వంలో హిందూ ధర్మాన్ని అణగదొక్కడానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉసిగొల్పినట్టుగా ఉంది. మీ గెస్ట్ హౌస్‌ల వద్ద ఈ నిబంధనలు ఎందుకు పెట్టలేదు? స్వామి వారికి నిత్యం పూజలు, భజనలు, అన్నదానం చేసే మఠాల మీద అక్కసు వెళ్లగక్కడం సిగ్గుచేటు. హిందూ ధర్మం మీద కూటమి ప్రభుత్వ దాడి చూస్తుంటే రాబోయే రోజుల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి మూల మూర్తి కొలువై ఉన్న ప్రదేశంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారేమో అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మఠాలు మఠాధిపతులు ఉండేది ధర్మ పరిరక్షణ కోసం. ధర్మ ప్రచారం కోసం. అలాంటిది అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశిస్తున్నారంటే ఆ మఠాల్లో అనైతిక, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతాయని అనుమానాలు వ్యక్తం చేయడమే అవుతుంది. టీటీడీలో మఠాల మీద జరుగుతున్న దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే వేంకటేశ్వరస్వామి భక్తుల మీద నిఘా పెట్టడమే అవుతుంది. ఇలాంటి చర్యలను వైయస్సార్సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. సనాతన ధర్మం మీద వేస్తున్న గొడ్డలిపెట్టు ఇదని స్పష్టంగా చెబుతున్నా.

# గ్రానైట్ క్వారీలో ఘోర ప్రమాదం..

**ఆరుగురు కార్మికుల మృతి**

ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లాలోని బల్లికురవ సమీపంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో డ్రిల్లింగ్ పనులు జరుగుతున్న సమయంలో బండరాళ్లు ఒక్కసారిగా విరిగి పడటంతో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మరికొంతమందిని తీవ్రంగా గాయపరిచింది. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

ఈ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ మొత్తం 16 మంది కార్మికులు పనిలో నిమగ్నమై ఉన్నారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో బండరాళ్లు విరగపడి క్వారీలో గందరగోళం నెలకొంది. ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకొని శిథిలాల కింద చిక్కుకున్నవారిని వెలికితీసేందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

మృతులంతా ఒడిశాకు చెందినవారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై బాపట్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి సహాయక చర్యలను వేగవంతం చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని వారు స్పష్టం చేశారు.

ఇంతలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘటనపై స్పందించారు. అధికారులను ఫోన్‌లో అడిగి వివరాలు సేకరించిన ఆయన, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించారు.

# కొనసాగుతున్న అశోక్‌బాబు దీక్ష

- పరామర్శించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు

**బాపట్ల:** రేపల్లె ఆసుపత్రిలో వైయస్ఆర్‌సీపీ నేత వరికూటి అశోక్‌బాబు దీక్ష కొనసాగుతోంది. ఆయన్ను ఆదివారం.. వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పరామర్శించారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ.. అశోక్ బాబు ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. "రైతుల సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరాహార దీక్ష విరమించనని అశోక్ బాబు అంటున్నారు. మూడు రోజుల నుంచి పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకుండా దీక్ష చేస్తున్నారు" అని అంబటి రాంబాబు చెప్పారు.

"వేమూరు నియోజకవర్గంలో రైతులంతా కలిసి కాలువలో గుర్రపు డెక్కతో తమ పడుతున్న ఇబ్బందిని అశోక్ బాబు దృష్టికి తీసుకువచ్చారు. ఆయన కాలువలో గుర్రపు డెక్క తొలగించాలంటూ రెండు రోజులు పాటు అక్కడే దీక్ష చేశారు. అధికారులు స్పందించట్లేదు. కనీసం కాలువల్లో గుర్రపు డెక్క కూడా తీయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది. కాలువలో గుర్రపు డెక్క ప్రభుత్వం తొలగించాలి. ప్రభుత్వానికి చేతకాకపోతే గుర్రపు డెక్క తొలగించడానికి రైతులకు అవకాశం ఇవ్వాలి" అని అంబటి రాంబాబు అన్నారు.

రేపల్లె టౌన్ సీఐ మల్లికార్జునరావు.. అశోక్‌బాబు పట్ల అమానుషంగా ప్రవర్తించాడు. అశోక్‌బాబు పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించాడు. అన్యాయాలకు, అక్రమాలకు పాల్పడిన అధికారులను కచ్చితంగా మేము గుర్తుపెట్టుకుంటాం" అని అంబటి రాంబాబు హెచ్చరించారు.

# పాఠశాల రేకు షెడ్డు నిర్మాణానికి భాగ్యవతి సేవా సంఘం చేయుత

- 1600 రూపాయలతో సిమెంట్ బ్యాగులు పాఠశాల షెడ్డు నిర్మాణానికి సహాయం.
- భాగ్యవతి సేవా సంఘం అధ్యక్షురాలు బొర్గం భాగ్యవతి.






**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 03.** మండలంలో గల కించాయిపుట్టు పంచాయితీ, దారపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో భాగ్యవతి సేవా సంఘం అధ్యక్షురాలు, జర్రెల సర్పంచ్ బొర్గం భాగ్యవతి తన సొంత నిధులతో పాఠశాలలో షెడ్డు నిర్మాణానికి అవసరమైన సుమారు 1600 రూపాయల సిమెంట్ ను ఉపాధ్యాయులు రాజు, ముక్కి రామకృష్ణ లకు ఆదివారం అందజేశారు. ప్రభుత్వం ఎంపీపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి ఐదుగురు ఉపాధ్యాయులు నియమించటంతో సుమారు 80 మంది విద్యార్థులు దారపల్లి పాఠశాలలో ఉన్నారు. పూర్తిస్థాయిలో అదనపు తరగతి భవనలులేక ఇరుకు గదుల్లోనే విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న భాగ్యవతి సేవా సంఘం అధ్యక్షురాలు చిన్న ఆర్థిక సహాయం చేయాలని ఆలోచనతో షెడ్డు నిర్మాణానికి సుమారు 1600 రూపాయలతో సిమెంట్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు చదువుల పట్ల ఆసక్తి పెరగాలంటే పాఠశాలలో విద్యా బోధనకు అదనపు తరగతి గదులు ఉండాలని, స్వేచ్ఛమైన వాతావరణంలో విద్యార్థులు విద్య అభ్యసనకు ఆసక్తి చూపుతారని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు తాను కూడ షెడ్డు నిర్మాణానికి చిన్న తోడ్పాటు అందించనన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు రాజు మాట్లాడుతూ.. మండలంలో వివిధ పాఠశాల విద్యార్థులకు భాగ్యవతి సేవా సంఘం తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, తమ పాఠశాలలో కూడ పిల్లలకు స్టడీ మెటీరియల్స్ అందించారని అలాగే షెడ్డు నిర్మాణం చేపడుతున్న విషయం తెలుసుకుని భాగ్యవతి సంఘం ద్వారా సిమెంట్ బస్తాలు అందజేయడం పట్ల సంఘం వారికి విద్యార్థిని విద్యార్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సీసా మత్యరాజు, బాగ్యవతి సేవా సంఘం సభ్యులు బి పూర్ణ రావు, ఏన్ సురేష్, బి పూర్ణమ్మ, బి సింహాద్రి, వి వెంకటరావు, దారపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# బెజవాడ, విశాఖ మెట్రోరైలు సక్సెస్ రేటు ఎంత?




**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ మెట్రో రైలు ఏర్పాటు పై కొంత విమర్శలు వినిపిస్తున్నాయి. విజయవాడను అభివృద్ధి చేయాలంటే కేవలం మెట్రో రైలు వేసినంత మాత్రాన సరిపోదని అంటున్నారు. కోట్లాది మంది జనాభా ఉన్న హైదరాబాద్ లోనే మెట్రో రైలు నష్టాల్లో నడుస్తుందని, తాము నడపలేకపోతున్నామని ఎల్ అండ్ టి సంస్థ బహిరంగంగానే చెబుతుంది. టిక్కెట్ల ధరలను పెంచుకునేందుకు అనుమతి కోరినా రాజకీయాలు, ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. హైదరాబాద్ మెట్రో రైళ్లకు ఆక్యుపెన్సీ బాగా ఉన్నప్పటికీ నిర్వహణ వ్యయం తడిసిమోపెడవుతుంది. హైదరాబాద్ జనాభా కోటికి పైగానే ఉంది. బెంగళూరు మెట్రో కూడా లాభాల బాటలో లేదు.

**ఎక్కువ కిలోమీటర్లు...**

పైగా హైదరాబాద్, బెంగళూరు మెట్రోలు ఎక్కువ కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్నాయి. అలాంటి చోట్లే మెట్రో రైళ్లు లాభాలతో నడవడం లేదు. పోనీ ప్రజా ప్రయోజనంతో నడపాలన్నా అంత పరిస్థితి నడిపే సంస్థలకు లేదు. అయితే విజయవాడ, విశాఖలో మెట్రో రైలు ఏ మేరకు సక్సెస్ అవుతుందన్నది ఇప్పుడు ప్రశ్న. ముఖ్యంగా విజయవాడ నగరాన్ని అతి పెద్ద పల్లటూరు అని అంటారు. విజయవాడ నగరం ఎటు వెళ్లినా పది నుంచి పదిహేను కిలోమీటర్ల దూరం ఉండదు. పైగా విజయవాడ జనాభా పది లక్షలకు మించలేదు. దీంతో మెట్రో రైళ్లలో ఎవరు ప్రయాణిస్తారన్న అనుమానం కలగుతుంది. కేవలం ఇతర రాష్ట్రాల్లో ఉన్నాయన్న కారణంతో ప్రవేశపెడితే నష్టాలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్నలు వినపడుతున్నాయి.

**ఈ నగరాల్లో సక్సెస్ అయినా..**

బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్ లలో సక్సెస్ అయిన మెట్రో రైళ్లు ఆర్థికంగా చూస్తే ఇంకా లాభాల బాట పట్టడం లేదు. అక్కడ ప్రజల జీవనశైలిలో భాగమైన మెట్రో సేవలను బాగానే ప్రజలు వినియోగించుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. ఈ మూడు నగరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మెట్రో రైళ్లు బాగా ఉపయోగపడుతున్నాయి. అందుకే ఆక్యుపెన్సీ శాతం ఎక్కువగా ఉంది. అలాంటిది విజయవాడలో పది లక్షల జనాభా, విశాఖలో ఇరవై లక్షల జనాభా ఉన్న నగరాలకు మెట్రో రైళ్లు అవసరమా? అన్న సందేహాలు అయితే అందరిలోనూ కలుగుతున్నాయి. విజయవాడ మెట్రో రైలు తొలి దశ వ్యయం 10,118 కోట్లు కాగా, విశాఖ మెట్రో రైలు తొలి దశ వ్యయం 11,498 కోట్ల రూపాయలు అవుతుంది.

**ఇంత డబ్బు పెట్టినా...**

మొత్తం 21,616 కోట్ల రూపాయల అంచనాతో భారీ అంచనా వ్యయంతో వీఎంఆర్డీఏ, సీఆర్డీఏ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. విజయవాడ నగరంలో కేవలం ఏలూరు రోడ్డు, బందరు రోడ్డులో ఉన్న వారి కోసం వేల కోట్లతో మెట్రో నిర్మించడంలో హేతుబద్ధత ఆలోచించాలని కోరుతున్నారు. విజయవాడ పశ్చిమ నియోజక వర్గంతో మెట్రోకు కనెక్టివిటీ లేదు, అత్యధిక జనాభా నివసించే సింగ్ నగర్ ప్రాంతంతో సంబంధం లేదు. ఇన్ని వేల కోట్ల ప్రాజెక్ట్ ఎవరి కోసం నిర్మిస్తున్నారన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. విశాఖపట్నం ఒకరకంగా పరవాలేదు. ఎందుకంటే కొంత రద్దీ ఉన్న నగరం కావడంతో పాటు పర్యాటకుల సంఖ్య కూడా ఎక్కువ కావడంతో ఇక్కడ మెట్రో కొంత వరకూ సక్సెస్ అవుతుందన్న ప్రభుత్వ అంచనాలు ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

# ఏసీలు మళ్లీ మొదలయ్యాయ్... ఉష్ణోగ్రతలు పెరిగాయిగా?




**హైదరాబాద్ పెన్ పవర్:** వానలు సంగతి దేవుడెరుగు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. విద్యుత్తు వినియోగం కూడా భారీగా పెరిగింది. వర్షాకాలంలో పడాల్సిన వానలు స్థానంలో తిరిగి ఎండలు దర్శనమిస్తున్నాయి. ఉక్కపోత కూడా విపరీతంగా పెరిగింది. దీంతో ఫ్యాన్లు, ఏసీల వాడకం విపరీతంగా పెరిగింది. గత రెండు రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఇదే రకమైన వాతావరణం కనిపిస్తుంది. ప్రజలు ఉక్కపోతతో అలమటించిపోతున్నారు. సాయంత్రానికి చల్లబడుతున్నా ఉదయం పది గంటల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది.

**లోటు వర్షపాతం...**

జులై నెలలో వానలు పడాల్సినంత స్థాయిలో పడలేదని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో తేమ లేని వాతావరణం నెలకొంది. అదే సమయంలో రెండు రాష్ట్రాల్లో లోటు వర్షపాతం నమోదయింది. మరొక వైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు నాటి సాగుకు సిద్ధమయిన సమయంలో సరైన వర్షాలు లేకపోవడంతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. అయితే వాతావరణ శాఖ మాత్రం ఆగస్టు రెండో వారం నుంచి భారీ వర్షాలు పడతాయని చెబుతోంది.

**ప్రాజెక్టులు నిండి...**

మరొకవైపు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టులు నిండిపోయాయి. జలకళను సంతరించుకున్నాయి. అనేక ప్రాజెక్టులు నిండి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోనూ గేట్లు ఎత్తారు. ప్రాజెక్టును చూసేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. మరొకవైపు నాగార్జున సాగర్ ప్రాజెక్టులో కూడా నిండుకుండను తలపిస్తుండటంతో గేట్లను ఎత్తారు. జూరాల ప్రాజెక్టు కూడా నిండిపోయి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# పంతం నీదా? నాదా? వైసీపీ, టీడీపీ ఎన్నికల పోరు




**హైదరాబాద్ పెన్ పవర్:** పులివెందులలో పొలిటికల్ హీట్ పెరిగింది. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలో గెలుపు కోసం టీడీపీ, వైసీపీలు ప్రయత్నిస్తున్నాయి. జడ్పీటీసీ సభ్యుడి ఆకస్మిక మరణంతో పులివెందులలో ఉపఎన్నిక జరగనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలైన తెలుగుదేశం పార్టీ వైసీపీలు నామినేషన్లు దాఖలు చేశాయి. ఒక్కొక్క పార్టీ నుంచి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 5వ తేదీ లోపు బీఫారాలు అభ్యర్థులకు పార్టీ అధినాయకత్వాలు అందచేయాల్సి ఉంది. ఆరో తేదీ నుంచి పార్టీలు ఎన్నికల ప్రచారం చేయడానికి వీలుంటుంది. ఈ నెల 12వ తేదీన ఎన్నిక జరగనుంది. అయితే రెండు పార్టీలు ముఖాముఖి తలపడుతుండంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

**రెండు పార్టీలు అభ్యర్థులను ప్రకటించి...**

వైసీపీ పులివెందుల జడ్పీటీసీ టిక్కెట్ ను మహేశ్వర్ రెడ్డి కుటుంబానికి ప్రకటించింది. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్ ఇలాకా కావడంతో పాటు సొంత నియోజకవర్గం అవ్వడంతో ఈ ఎన్నిక రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఖచ్చితంగా తమ అభ్యర్థి గెలుస్తారని వైసీపీ ధీమాగా ఉంది. జగన్ ఇమేజ్ దెబ్బతినకుండా ఉండాలంటే పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ఖచ్చితంగా వైసీపీ గెలవాల్సి ఉంటుంది. అందుకే వైసీపీ నేతలు శక్తికి మించి పోరాడుతున్నారు. ప్రతిపక్షంలో ఉండి తమ స్థానాన్ని తాము నిలబెట్టుకునేందుకు వైసీపీ తీవ్రంగా శ్రమిస్తుంది. జగన్ నేరుగా ప్రచారం పాల్గొనకపోయినా నాయకులను ఎప్పటికప్పుడు బెంగళూరు నుంచి అప్రమత్తం చేస్తున్నారు.

**మానసికంగా ఒత్తిడి తేవాలని...**

మరొక వైపు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికల్లో గెలిచి జగన్ పై మానసికంగా వత్తిడి తేవాలని తీవ్రంగా ప్రయత్నిస్తుంది. గతంలో కుప్పం నియోకవర్గంలో తమ పార్టీని ఓడించి సంబరాలు చేసుకున్నట్లుగానే ఈసారి పులివెందులలో తమ సత్తా చూపాలని పసుపు పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారు. దీంతో అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతా రెడ్డిని పోటీకి దించింది. లతారెడ్డితోపాటు బీటెక్ రవి తమ్ముడు జయభరత్ రెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు. జడ్పీటీసీ ఎన్నికను సవాలుగా వైసీపీ నేత సతీష్ రెడ్డి తీసుకున్నారు. బీటెక్ రవి గెలిచి తీరాలని తీవ్ర ప్రయత్నమే చేస్తున్నారు. దీంతో పులివెందులలో రాజకీయం వేడెక్కింది.

**ఆధిపత్యం సాధించేందుకు...**

పులివెందులలో పార్టీకున్న పట్టుతో పాటు వైసీపీ సెంటిమెంట్ అస్త్రాన్ని ఉపయోగిస్తుంది. జడ్పీటీసీ మరణించినా పోటీకి దింపడంతో పాటు వారి కుటుంబానికే సీటు ఇవ్వడంతో జనం సెంటిమెంట్ కు పడిపోతారని వైసీపీ ఆలోచిస్తుంది. అధికారంలో ఉండటంతో తమకు అడ్వాంటేజీగా అవుతుందని భావిస్తున్నారు. అస్త్రశస్త్రాలను ఉపయోగిస్తుంది. ఎలాగైనా గెలిచి తీరాలని భావిస్తుంది. జగన్ పై ఆధిపత్యాన్ని తెచ్చుకోవాలన్నా, ఏపీ ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలకు చెక్ పెట్టాలనుకున్నా ఖచ్చితంగా గెలిచి తీరాల్సిన విషయం. అందుకే ఈ ఎన్నికల్లో టీడీపీ పై చేయి సాధించి జగన్ పై కక్ష తీర్చుకోవాలనుకుంటుంది. దీంతో వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఏం జరుగుతుందని రాష్ట్రం మొత్తం ఆసక్తిగా చూస్తుంది.

# ఎంత మంది ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమ అయ్యాయంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నదాత సుఖీఖవ పథకం కింద 99.98 శాతం మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయని అధికారులు తెలిపారు. నిన్న ప్రారంభమయిన నిధుల విడుదలతో 44.75 లక్షల మంది రైతులకు సాయం అందిందని వెల్లడించారు. అర్హులైన వారందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులను జమ చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్ పథకం కింద రెండు వేల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఐదు వేల రూపాయలు కలిపి ఏడు వేల రూపాయలుజమచేస్తామని తెలిపారు.

**జమ కాని వారు...**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న ప్రాంతాల్లో జమ కాలేదని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ కేవైసీ సమస్య, ఎన్?పీసీలో చురుగ్గా లేని ఖాతాల్లో నిధులు జమకాలేదని, అలాగే వ్యవసాయశాఖ డేటా ప్రకారం కేవలం 1067 ఖాతాలకు మాత్రమే నగదు బదిలీ కాలేదని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. తిరస్కరణకు గురైన రైతులు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు ఇవ్వవచ్చని సూచించారు. అయితే ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కూడా వారు చెబుతున్నారు.

**ఈ కారణంతోనే...**

ఈ కేవైసీ చేసుకోని రైతులందరూ చేయించుకోవాలని తెలిపారు. స్థానికసంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయిన ప్రాంతాల్లో మాత్రం ఎన్నిక పూర్తయిన తర్వాత మాత్రమే జమ అవుతాయని చెబుతున్నారు. వారు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఐదు వేల రూపాయలు వారి ఖాతాల్లో జమ అవుతాయని అన్నారు. అయితే అన్ని అర్హతలు ఉండి నిధులు కాని వారు కూడా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి వినతి పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు.

# కల్వకుంట్ల కవిత కోరుకుంటున్నదదేనా? ఆ ఒక్కటీ అడక్కు అని గులాబీ బాస్ అంటున్నారా?




**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డైరెక్ట్ గా బీఆర్ఎస్ నేతలపై మాటల దాడికి దిగారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిపై నేరుగా ఆమె ఆరోపణలు చేయడం చూస్తుంటే ఆమె పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయాలని కోరుకుంటున్నట్లు కనపడుతుంది. జగదీశ్వర్ రెడ్డిని లిల్లీపుట్ గా అభివర్ణిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు కారు పార్టీలో కలకలం రేపాయి. ఎందుకంటే జగదీశ్వర్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడు. ఉద్యమకాలం నుంచి ఆయన కేసీఆర్ వెన్నంటే ఉన్నాడు. ఆ విషయం కవితకు తెలియంది కాదు. అదే సమయంలో తన సోదరుడు కేటీఆర్ కు కూడా జగదీశ్వర్ రెడ్డి ఆప్తమిత్రుడని కవితకు తెలుసు. అందుకే ఇక నేరుగా ఎటాక్ చేయడం ప్రారంభించినట్లుంది.

**జగదీశ్ రెడ్డిపై నేరుగా...**

అయినా సరే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కొందరు వెనకేసుకు వస్తున్నారన్ని అన్నారు. లిల్లీపుట్ నాయకుడు అంటూ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై ఆమె మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో పార్టీని నాశనం చేసిన వాళు తనపై బురద జల్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నల్లగొండలో చచ్చీచెడీ .. చావుతప్పి కన్నులొట్ట పోయి ఒక్కడే గెలిచారని అన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనపై సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నా బీఆర్ఎస్ నేతలు స్పందించలేదని అన్నారు. లిల్లీపుట్ నాయకుడు వల్లనే తనపై ట్రోల్స్ చేస్తున్నా స్పందించడం లేదన్నారు. నేడు కూడా జగదీశ్ రెడ్డి ఎర్రవెల్లి లోని ఫామ్ హౌస్ కు జగదీశ్వర్ రెడ్డి వెళ్లపోతున్నారు.

**అది తేలేవరకూ...**

తాను కేసీఆర్ కు రాసిన లేఖ బయటపెట్టింది ఎవరన్నది తేలేవవరకూ తాను పార్టీకి దూరంగా ఉంటానని కల్వకుంట్ల కవిత చెప్పడం చూస్తే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లిపోవాలనే ఉద్దేశ్యం ఆమెలో స్పష్టంగా కనిపిస్తుంది. తనంతట తాను రాజీనామా చేయకుండా పార్టీ కనుక సస్పెండ్ చేస్తే తనకు సానుభూతి మాత్రం పుష్కలంగా లభిస్తుందని కవిత అంచనా వేస్తున్నారు. అందుకే ఇన్నాళ్లు కేసీఆర్ చుట్టూ దయ్యాలు.. అంటూ వ్యాఖ్యలు చేసిన కవిత ఇప్పుడు నేరుగా జగదీశ్వర్ రెడ్డిని టార్గెట్ చేయడం చూస్తుంటే తాను సస్పెండ్ కావాలని కోరుకుంటున్నట్లు కనపడుతుంది. తన కోపమంతా సోదరుడు కేటీఆర్ పైనే. అయితే నేరుగా కేటీఆర్ పేరు ప్రస్తావించకుండా జగదీశ్వర్ రెడ్డి పేరుతో విమర్శలకు దిగి ఒకరకంగా పార్టీ నాయకత్వానికి సవాల్ విసిరారు.

**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో...**

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కల్వకుంట్ల కవిత స్పీడ్ పెంచారని ఎవరికైనా ఇట్లే అర్థమవుతుంది. టీవీ మీడియాలకు ఇంటర్వ్యూలు ఇస్తూ తన ప్రయాణంపై కూడా ఆమె స్పష్టత నిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరొకవైపు బీఆర్ఎస్ కూడా ఆచితూచి కవిత విషయంలో వ్యవహరిస్తుంది. తాము పట్టించుకోనట్లు వదిలేసినా, కవిత కాలు దువ్వడానికి కారణం గుర్తించి నాయకత్వం కూడా నెమ్మదిగానే అడుగులు వేయాలని నిర్ణయించినట్లుంది. అందుకే కవిత తనపై చేసిన విమర్శలకు జగదీశ్వర్ రెడ్డి చాలా హుందాగా సమాధానమిచ్చారు. సంయమనం ప్రదర్శించారు. కేసీఆర్ ను కలసి వచ్చిన తర్వాత మీడియా సమావేశం పెట్టి జగదీశ్వర్ రెడ్డి తన ఉద్యమ ప్రస్తానంపై కవితమ్మకు ఉన్న జ్ఞానానికి జోహార్లని, ఆమె చేసిన ప్రయత్నాలకు తాను సానుభూతిని తెలియచేస్తున్నానని మాత్రమే చెప్పి వదిలేశారు. దీన్ని బట్టి చూస్తుంటే కవిత విషయంలో కాస్త ఓపిగ్గా వేచి చూడటమే బెటరని గులాబీ పార్టీ అధినేత భావిస్తునట్లు స్పష్టంగా కనపడుతుంది.

# ప్రపంచకప్ లో కోహ్లి.. టీమ్ ఇండియా స్టార్ చుట్టూ తీవ్రస్థాయి చర్చ



**హైదరాబాద్ పెన్ పవర్:** దాదాపు 14 నెలల కిందటే టి20ల నుంచి రిటైర్.. మూడు నెలల కిందట తనకెంతో ఇష్టమైన, అత్యంత కీలకమైన ఇంగ్లండ్ టూర్ ముందు టెస్టుల నుంచి రిటైర్.. కానీ, అతడు మాత్రం ఇంకా హాట్ టాపిక్ గానే ఉన్నాడు. ఇప్పటికీ అతడు టీమ్ఇండియాలో లేడంటే నమ్మనివారు తక్కువే. మళ్లీ ఇప్పుడు వన్డే ప్రపంచ కప్ లో తన ప్రాతినిధ్యం ఉంటుందనే కథనాలు వస్తున్నాయి.

**కోహ్లిలినూర్ లేకుండా...**

భారత క్రికెట్ లో 15 ఏళ్లుగా విడదీయరాని భాగం అయ్యాడు విరాట్ కోహ్లి. వందకు పైగా టెస్టులు.. టి20 ప్రపంచ కప్ చాంపియన్, కెప్టెన్ గా ఎన్నో విజయాలు, ఆటగాడిగా మరెన్నోమైలురాళ్లు.. ఇదీ కోహ్లి గొప్పదనం. అలాంటివాడు వన్డేలకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాడు. 36 ఏళ్ల కోహ్లి టెస్టులకు కూడా వీడ్కోలు పలుకుతాడని ఈ ఏడాది మే వరకు ఎవరూ ఊహించలేదు. అంతకుముందు టి20ల నుంచి తప్పుకొన్నా పెద్దగా ఆశ్చర్యపోలేదు కానీ.. టెస్టులకు మాత్రం గుడ్ బై పలుకుతాడని భావించలేదు. దీంతో కోహ్లి లేకుండానే టీమ్ ఇండియా ప్రస్తుతం ఇంగ్లండ్ లో టెస్టు సిరీస్ ఆడింది.

**కోహ్లి మళ్లీ ఎప్పుడు..?**

కోహ్లి వన్డేలు మాత్రమే ఆడతాడు. కానీ, అసలు వన్డేలు ఎక్కడ జరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో చాంపియన్స్ ట్రోఫీ అనంతరం టీమ్ ఇండియా ఆరు నెలలుగా ఒక్క వన్డే కూడా ఆడలేదు. అసలు ప్రపంచ క్రికెట్ లోనే వన్డేలు చాలా తక్కువ. భారత్ మళ్లీ వన్డేలు ఆడేది నవంబరులో ఆస్ట్రేలియాతో. వాస్తవానికి ఈ నెలలో బంగ్లాదేశ్‌లో పర్యటించాల్సి ఉన్నా.. అక్కడి పరిస్థితుల కారణంగా టూర్ క్యాన్సిల్ అయింది. దీంతో కోహ్లిని మళ్లీ టీమ్ఇండియా జెర్సీలో చూసేది ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ లోనే.

**వచ్చే ప్రపంచ కప్ పరిస్థితి ఏమిటి?**

కోహ్లితో పాటు టీమ్ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ కూడా టెస్టులకు వీడ్కోలు పలికాడు. అతడు కూడా టి20లకు మాత్రమే అందుబాటులో ఉంటాడు. రోహిత్ ను కూడా ఆస్ట్రేలియాతో సిరీస్ లోనే చూసే చాన్సుంది. అయితే, వీరిద్దరిలో 38 ఏళ్ల రోహిత్ వచ్చే వన్డే ప్రపంచ కప్ ఆడడం కష్టమే. కానీ, కోహ్లికి ఇప్పుడు 36 ఏళ్లే. వచ్చే ప్రపంచకప్ 2027 నవంబరులో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లో జరగనుంది. అప్పటికి సరిగ్గా 39 ఏళ్ల వయసుకు

వస్తాడు కోహ్లి. ఫామ్ ప్రకారం కంటే ఫిట్ నెస్ లోనే ప్రస్తుతం కోహ్లి టాప్ లో ఉన్నాడు. అందుకే వచ్చే ప్రపంచ కప్ ఆడతాడని అంటున్నారు. ఏది ఏమైనదీ.. ఈ ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లి ఆడే తీరును బట్టి తెలిసిపోతుంది. అయితే, దీనికిముందే 2027 ప్రపంచకప లో అతడి ప్రాతినిధ్యంపై కథనాలు వస్తున్నాయి.

# అత్యాచార కేసులో 35 ఏళ్ల శిక్ష : అమెరికా జైల్లో తెలుగు యువకుడి ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో జైలు శిక్ష అనుభవిస్తున్న తెలంగాణకు చెందిన యువకుడు కుర్రెముల సాయికుమార్ (31) ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లైంగిక నేరాల కేసులో 35 ఏళ్ల జైలు శిక్ష పడిన తర్వాత సాయికుమార్ జూలై 26న జైలులో ఉరి వేసుకుని చనిపోయాడు. జనగామ జిల్లాలోని లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన సాయికుమార్ దాదాపు పదేళ్ల క్రితం అమెరికా వెళ్లారు.సాయికుమార్ ఒక్లహోమా రాష్ట్రంలోని ఎడ్మండ్ నగరంలో తన భార్యతో కలిసి నివసిస్తున్నారు. అక్కడ అతను 15 ఏళ్ల బాలుడిగా నటించి ముగ్గురు బాలికలపై లైంగిక దాడులకు పాల్పడినట్లు, ఇంకా 19 మంది బాలికలను అసభ్యకర చిత్రాలతో బెదిరించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో, ఎఫ్‌బీఐ రంగంలోకి దిగి 2023 అక్టోబరులో సాయికుమార్‌ను అరెస్ట్ చేసింది.విచారణలో సాయికుమార్‌పై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో, 2025 మార్చి 27న అమెరికా కోర్టు అతడికి 35 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్ష తర్వాత మానసికంగా కుంగిపోయిన సాయికుమార్ జూలై 26న జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు.కుటుంబ సభ్యుల విషాదం ఈ విషయం తెలుసుకున్న సాయికుమార్ తల్లిదండ్రులు ఉప్పలయ్య, శోభ అమెరికా వెళ్లారు. అక్కడే అతని అంత్యక్రియలు నిర్వహించినట్లు సమాచారం. ఈ ఘటన తెలుగు యువతకు ఒక హెచ్చరికగా నిలుస్తోంది. ఆన్‌లైన్ ప్రపంచంలో అడ్డగోలుగా చేసే పనులు ఎంతటి ప్రమాదకర పరిణామాలకు దారితీస్తాయో ఈ విషాదం స్పష్టం చేస్తోంది.

# అంబటి లాజిక్కు.. వైసీపీకి పెద్ద ఓదార్పు!




**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు మీడియా సమావేశాలు ఆ పార్టీ హైకమాండ్ కు పెద్ద ఓదార్పుగా మారాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న లిక్కర్ స్కాంలో దర్యాప్తు అధికారులు లీకులతో సీనియర్ నేతలు చాలా మంది మౌనాన్ని ఆశ్రయిస్తున్నారు. కానీ, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాత్రం ప్రతి విషయంపైనా స్పందిస్తూ వైసీపీ కేడరుకు మనోధైర్యం ఇస్తున్నారని అంటున్నారు. తాజాగా రెండు ఉదంతాల్లో వైసీపీ పూర్తిగా డైలమాలో పడిపోగా.. నేనున్నా అంటూ పార్టీని వెనకేసుకుని అంబటి చేసిన వ్యాఖ్యలు కేడరుకు ధైర్యం ఇచ్చిందని అంటున్నారు. ఇటీవల హైదరాబాద్ నగర శివార్లలో రూ.11 కోట్ల నగదు లభ్యమైంది. ఈ డబ్బు లిక్కర్ స్కాంలో ప్రధాన నిందితుడు అయిన కేసీరెడ్డి రాజశేఖరరెడ్డిది అంటూ ఏ40 వరుణ్ పురుషోత్తం వాంగ్మూలమిచ్చాడని సిట్ ప్రకటించింది. అయితే తనకు బెయిలు రాకుండా అడ్డుకునేందుకు సిట్ కట్టు కథ అల్లిందని ఆ డబ్బుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఏ1 కేసిరెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. అయితే డబ్బు పట్టుబడిన వెంటనే వైసీపీలో ఇతర నేతలు తొట్రుపాటుకు లోనవ్వగా అంబటి మాత్రం ఆ డబ్బుతో వైసీపీకి ఏం సంబంధం అంటూ ఎదురు తిరిగారు. అదేవిధంగా తాజాగా లిక్కర్ కేసులో ఏ34 వెంకటేశ్ నాయుడు డబ్బు లెక్కిస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఈ వీడియో కూడా వైసీపీని ఆత్మరక్షణలో పడేయగా, మళ్లీ అంబటి తెరపైకి వచ్చారు.లిక్కర్ స్కాంలో కమీషన్ గా వసూలు చేసిన డబ్బును డెన్ లో దాచి ఎన్నికల ముందు వైసీపీ అభ్యర్థులకు పంపిణీ చేశారని సిట్ తోపాటు ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనికి ఆధారంగా వెంకటేశ్ నాయుడు ఉన్న వీడియోను బయటపెట్టింది. అయితే ఆ వీడియోపైనా వైసీపీ నేతలు ఎవరూ మాట్లాడలేకపోయారు. కానీ అంబటి మాత్రం తన లాజిక్కుతో ప్రభుత్వాన్ని కూడా గందరగోళంలోకి నెట్టేశారని పరిశీలకులు అంటున్నారు. వీడియోలో వెంకటేశ్ నాయుడు డబ్బు లెక్కిస్తున్న దృశ్యంలో రెండు వేల రూపాయల నోట్ల కట్టలు ఉన్నాయని అంబటి లేవనెత్తారు. 2024 ఎన్నికలకు డబ్బు పంపిణీ చేశామని చెబుతున్నారని, అయితే 2023లోనే రూ.2 వేల నోట్లను కేంద్రం రద్దు చేసిందని అంబటి గుర్తు చేస్తున్నారు. రద్దు చేసిన నోట్లను ఎన్నికల్లో ఎలా ఖర్చు పెడతారని ప్రశ్నించడం ద్వారా ఆ వీడియో ఇప్పటిది కాదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. మాజీ మంత్రి అంబటి లేవనెత్తిన ఈ లాజిక్కు వైసీపీకి పెద్ద ఓదార్పుగా మారిందని అంటున్నారు. వీడియోను చూసిన వారు ఎవరైనా రూ.2 వేల నోట్లపై సందేహం వ్యక్తం చేస్తారని అంటున్నారు. అయితే సిట్ మాత్రం ఆ డబ్బు వెంకటేశ్ నాయుడు లిక్కర్ స్కాంలో కమీషన్ గా తీసుకున్నదేనని నిరూపించే బలమైన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెబుతోంది.

# జగన్‌కు పులివెందుల అగ్ని పరీక్ష.. అప్పుడు కుప్పంలో చేసినట్లే..

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సొంత నియోజక వర్గం పులివెందులలో రాజకీయం వేడెక్కింది. వైఎస్ కుటుం బానికి ఓటమే లేని పులివెందులలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఎటు దారితీస్తాయనే ఉత్కంఠ రేపుతున్నాయి. పులివెందుల నియోజకవర్గంలో వైఎస్ కుటుంబానికి ఇంతవరకు ఎదురులేదు. వారికి ఎదురు నిలిచి గెలిచిన చరిత్ర కూడా ఎవరికీ లేదు. ఇక వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పులివెందులలో మరింత పట్టు సాధించారు. వైఎస్ ఫ్యామిలీ నుంచి అభ్యర్థి ఎవరైనా ప్రత్యర్థి డిపాజిట్ తెచ్చుకోవడం కూడా గగనమని గత గణాంకాలు చెబుతున్నాయి. వైఎస్ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన మాజీ సీఎం జగన్మోహనరెడ్డి హయాంలో తన ప్రత్యర్థులను కూడా తనతో కలుపుకున్నారు. గతంలో వైఎస్ కుటుంబానికి ప్రత్యర్థిగా తలపడిన సతీశ్ రెడ్డిని వైసీపీలో చేర్చుకుని ఎమ్మెల్సీ చేశారు. ఈ పరిస్థితుల్లో పులివెందుల అంటే వైఎస్ కోటగా భావిస్తారు. అయితే తొలిసారిగా వైఎస్ కోటలో వణుకు పుట్టించేలా ఓ చిన్న ఎన్నిక ద్వారా టీడీపీ సవాల్ విసురుతోంది. దీంతో రాజకీయం రసవత్తరంగా మారింది.

**ఏకగ్రీవం కోసం వైసీపీ ప్రయత్నం?**

మాజీ సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో పులివెందుల జడ్పీటీసీ పదవికి ఈ నెల 12న ఉప ఎన్నిక జరగనుంది. గతంలో జరిగిన ఎన్నికల్లో పులివెందుల జడ్పీటీసీని వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. అలా గెలిచిన జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 1న నామినేషన్ల దాఖలకు గడువు ముగిసింది. గతంలో ఏకగ్రీవం చేసుకున్న స్థానాన్ని మళ్లీ ఏకగ్రీవం చేసుకోవడానికి తొలుత వైసీపీ ప్రయత్నాలు చేసింది. మహేశ్వరరెడ్డి భార్యను పోటీకి పెట్టి మరణించిన నేత కుటుంబానికే పదవి వదిలేద్దామని ప్రతిపాదన చేసింది. అయితే అధికార టీడీపీ కూటమి ఈ ప్రతిపాదనకు ఎంత మాత్రం అంగీకరించలేదని చెబుతున్నారు. దీనికి కారణం మాజీ ముఖ్యమంత్రి జగన్ పై పైచేయి సాధించే అవకాశం తొలిసారి దక్కడమే అంటున్నారు.

**రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం**

పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఇంకా ఏడాది పదవీకాలం మాత్రమే ఉంది. ఇక్కడ గెలవడం ద్వారా జడ్పీ రాజకీయాలు కూడా ఏమాత్రం ప్రభావితం కావు. కానీ, పులివెందుల గెలుపు రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు. అందుకే ఈ స్థానంలో గెలపును టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. తన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి భార్య లతారెడ్డిని బరిలోకి దింపింది. పులివెందులలో ఇప్పటివరకు వైఎస్ కుటుంబానిదే హవా అయినప్పటికీ తొలిసారి ఆ కుటుంబానికి చెక్ చెబుతామంటున్నారు బీటెక్ రవి. గతంలో అధికారం అండతో స్థానిక ఎన్నికల్లో వైసీపీ గెలిచిందని, ఇప్పుడు ఆ అవకాశం తమకు వచ్చిందని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఉప ఎన్నికను దృష్టిలో పెట్టుకుని పలువురు వైసీపీ నేతలను టీడీపీలో చేర్చుకుంటున్నారు. వైసీపీతో ఢీ అంటే ఢీ అంటున్నారు.

**అవినాశ్ రెడ్డికి గెలుపు బాధ్యత**

మరోవైపు సిట్టింగు స్థానాన్ని కాపాడుకోవడం వైసీపీకి ముఖ్యంగా అధినేత జగన్ కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు బాధ్యతలను ఎంపీ అవినాశ్ రెడ్డికి అప్పగించారు జగన్. కడప పార్లమెంటు పరిధిలో రెండు చోట్ల జడ్పీటీసీ ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో ఒకటి పులివెందుల కాగా, మరొకటి ఒంటిమిట్ట. ఇక్కడ జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన జడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఒంటిమిట్టలోనూ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. అయితే ఒంటిమిట్ట ఫలితం ఎలా ఉన్నా పులివెందుల నిలుపుకోవడం వైసీపీకి ప్రాణసంకటంగా మారిందని అంటున్నారు. ఇక్కడ ఏ మాత్రం పొరపాటు జరిగినా అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కుంగిపోయిన పార్టీకి మరింత నష్టమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వైఎస్ సొంత ఇలాకాలో ఓటమి అన్న ఊహనే వైసీపీ కేడర్ తట్టుకోలేకపోతున్నారు. అయితే వైసీపీ అధికారంలో ఉండగా, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో స్థానిక సంస్థలు అన్నింటిని వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది.

# నిద్రలో ఊపిరి ఆగినట్టు అనిపించి సడన్‌గా మెలకువ వస్తుందా..? అయితే అర్జెంట్‌గా..



**హైదరాబాద్ పెన్ పవర్:** నిద్రపోయేటప్పుడు గొంతు భాగంలో ఉన్న కండరాలు ఎక్కువగా రిలాక్స్ అవుతాయి. దాంతో నాలుక లేదా టాన్సిల్స్ లాంటి మృదు కణ జాలాలు (సాఫ్ట్ టిష్యూ) ఉండే భాగాలు గాలి వెళ్లే ద్వారాన్ని అడ్డుకుంటాయి. దీన్నే అబ్?స్ట్రక్టివ్? స్లీప్? ఆప్నియా అంటాం. ఈ బ్లాకేజీ కండిషన్? కొన్ని సెకండ్ల నుంచి ఒక నిమిషం పాటు ఉంటుంది. ఆ టైంలో మెదడుకు ఆక్సిజన్ తక్కువై, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది తలెత్తుతుంది. ఇది కొన్ని క్షణాలపాటు ఉండడం వల్ల ఎవరూ ఆ పరిస్థితిని గుర్తుపెట్టుకోలేరు. దీంతో గాఢనిద్రలోకి వెళ్లకుండా మాటిమాటికీ మెలకువ వస్తూ ఉంటుంది. తద్వారా శరీరానికి సరిపడా నిద్ర ఉండదు. ఊపిరి తీసుకోవడంలో కలిగే ఈ ఇబ్బందులు లేదా ఆప్నియాలు ఒక్కరాత్రిలోనే పది నుంచి వందలసార్లు కూడా వస్తాయి. నిద్రపోయేటప్పుడు చాలామందికి గురక వస్తుంటుంది. దాంతో పక్కనవాళ్లు ఇబ్బంది పడడం సహజం. కానీ, గురకపెట్టేవాళ్లు ఎంత ఇబ్బంది పడతారో తెలుసా? గురక వల్ల ఎంతసేపు నిద్రపోయినా వాళ్లకు విశ్రాంతి తీసుకున్నట్టు అనిపించదు. కానీ, ఈ సమస్యను చాలామంది గుర్తించరు. తమంతట తాముగా గుర్తించలేరు కూడా. ఆ కండిషన్?నే అబ్?స్ట్రక్టివ్? స్లీప్ ఆప్నియా (ఒఎస్?ఎ) అంటారు.ఇది సైలెంట్?గా నిద్రను డిస్టర్బ్? చేస్తుంది. తద్వారా దీర్ఘకాలిక అలసటకు దారితీస్తుంది. అంతేకాదు.. మరెన్నో హెల్త్? ప్రాబ్లమ్స్? రావడానికి అవకాశం ఉందని ముందుగా తెలియజేసే అలారమ్? లాంటిది. దీనివల్ల 'బయటకు కనిపించని ఇబ్బందులు చాలా ఉంటాయి. కానీ మన శరీరం ఇచ్చే సంకేతాలను బట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోగలిగితే లైఫ్? మారిపోతుంది' అంటున్నారు డాక్టర్లు.

# పహల్గాం టెర్రరిస్టుకు పాక్ లో అంత్యక్రియలు.. దాయాది హస్తం బట్టబయలు



**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి వెనుక పాకిస్తాన్ పాత్ర మరోసారి స్పష్టంగా బయటపడింది. ఈ దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులలో ఒకడైన తాహిర్ హబీబ్‌కు పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (%ూశీఖ%)లో మృతదేహం లేకుండానే అంత్యక్రియలు నిర్వహించడం పాకిస్తాన్‌కు ఉగ్రవాదంతో ఉన్న సంబంధాలను నిరూపిస్తుంది. ఈ ఘటనతో, ఉగ్రవాదులకు పాక్ ఇచ్చే మద్దతు, భారత్ పై ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న విధానం మరోసారి వెలుగులోకి వచ్చాయి.

**గైబ్ జనాజా: పాక్ లోని గందరగోళం**

తాహిర్ హబీబ్‌కు పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని రావల్‌కోట్ సమీపంలో గైబ్ జనాజా (మృతదేహం లేకుండానే జరిపే అంత్యక్రియలు) నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి వీడియోలు, ఫోటోలు ఒక టెలిగ్రామ్ ఛానెల్‌లో వైరల్ అయ్యాయి. ఈ అంత్యక్రియలలో పాల్గొనడానికి లష్కరే తోయిబా కమాండర్ రిజ్వాన్ హనీఫ్ ప్రయత్నించగా, తాహిర్ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఈ ఘర్షణలో ఉగ్రవాదులు తమ ఆయుధాలను చూపించి స్థానికులను బెదిరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సంఘటనలు పాకిస్తాన్ లో ఉగ్రవాద సంస్థలు ఎంత బలంగా ఉన్నాయో, ఎంత దారుణంగా స్థానిక ప్రజలను భయపెడుతున్నాయో చూపిస్తున్నాయి. చనిపోయిన ఉగ్రవాదికి మృతదేహం లేకుండానే అంత్యక్రియలు చేయడం, అలాగే అతని కుటుంబ సభ్యులను బెదిరించడం వంటి సంఘటనలు పాకిస్తాన్లో ఉగ్రవాదం ఏ స్థాయికి చేరుకుందో నిరూపిస్తాయి.

**విద్యార్థి నాయకుడి నుంచి ఉగ్రవాదిగా తాహిర్**

తాహిర్ హబీబ్ మొదట ఇస్లామిక్ జమాత్ తలాబా , స్టూడెంట్ లిబరేషన్ ఫ్రంట్‌లలో పనిచేశాడు. అతని కోడ్‌నేమ్ "అఫ్గాని". నిఘా వర్గాల ప్రకారం తాహిర్‌కు పాకిస్తాన్ సైన్యంతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి, ఇవే అతనిని ఉగ్రవాద మార్గంలోకి నడిపించాయని నిపుణులు చెబుతున్నారు.

**ఆపరేషన్ మహాదేవ్: ఉగ్రవాదులకు ధీటైన సమాధానం**

పహల్గాం సమీపంలో సుమారు 13,000 అడుగుల ఎత్తులో మంచుతో నిండి ఉన్న మహాదేవ్ పర్వతాలలో ఈ ఉగ్రవాదులు తలదాచుకున్నారు. ఆగస్టు 2 అర్ధరాత్రి తర్వాత చైనా తయారీ '%ు%82' ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సెట్ ద్వారా ఉగ్రవాదులు సంభాషణలు జరిపారు. ఈ సిగ్నల్ ను గుర్తించిన భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్మూ, కశ్మీర్ పోలీసులు సమన్వయంతో, ఆపరేషన్ మహాదేవ్‌ను చేపట్టారు. ఉదయం 11 గంటల సమయంలో ఉగ్రవాదులను గుర్తించి ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇది భారత భద్రతా దళాల అప్రమత్తతకు, వారి సమర్థతకు నిదర్శనం.పీవోకేలో గైబ్ జనాజాలు, ఉగ్రవాదుల కుటుంబాలను బెదిరించడం, అలాగే అధునాతన కమ్యూనికేషన్ పరికరాలు లభించడం వంటి ఆధారాలు పాకిస్తాన్ ఉగ్రవాదానికి పునాదిగా మారిందని స్పష్టంగా సూచిస్తున్నాయి. ఈ ఘటనలు భారత్‌పై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి బలమైన సాక్ష్యాలుగా నిలిచాయి.

# ప్రధాని మోదీ ఫస్ట్ ఫిమేల్ బాడీగార్డ్.. అదానో కపేసా ఎవరు?



హైదరాబాద్ పెన్ పవర్: ఇటీవల ప్రధాని మోదీ యూకె పర్యటనలో లక్షలాది మందిని ఆకర్షించింది ఓ దృశ్యం..ఆ సీన్‌లో మోదీ వెనక ఓ మహిళ కనిపిస్తోంది. ఆమె ప్రధాని మోదీ పక్కన నిలబడి ఉన్న మహిళా బాడీగార్డ్. ఆమె పేరు అదానో కపేసా.. ఇప్పుడు ఈమె గురించే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఓ మహిళ అత్యంత కీలక బాధ్యతలో ఉండటాన్ని చూసి నెటిజన్లు ఆశ్చర్యంతో పాటు ప్రశంసలు కురిపించారు.

**ఎవరీ అదానో కపేసా.. ?**

అదానో కపేసా..ప్రధాని మోదీకి తొలి ఫిమేల్ బాడీగార్డ్. అత్యున్నత స్థాయి సెక్యూరిటీ ఫోర్స్ అయిన స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ లో ఈమె ఎలైట్ కమాండోగా పనిచేస్తున్నారు. ఈ బృందం ప్రధానమంత్రికి, ఆయన కుటుంబ సభ్యులకు భద్రత కల్పిస్తుంది. కఠినమైన శిక్షణ, సామర్థ్యం ఉన్నవారు మాత్రమే %ఖ్రా+%లో భాగం కాగలుగుతారు. అదానో కపేసా ఎంపిక భారత భద్రతా వ్యవస్థలో మహిళల పాత్రకు పెరుగుతున్న ప్రాముఖ్యతకు నిదర్శనంగా చెప్పొచ్చు.

అదానో కపేసా..మణిపూర్ కు చెందిన ఇన్ స్ట్రక్టర్. ప్రధాని మోదీ సెక్యూరిటీ టీంలో ఉన్న మణిపూర్ నుంచి తొలి మహిళ. అంతేకాదు.. దేశంలోనే బెస్ట్ సెక్యూరిటీ ఫోర్స్ లో మొదటి మహిళ రికార్డ్ సృష్టించింది. అదానో కపేసా..మొదట హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర సాయుధ పోలీసు దళం సశస్త్ర సీమా బల్ (%ూాదీ%)లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆమె ఉత్తరాఖండ్ లోని పిథోర్ గడ్ లో 55వ బెటాలియన్ లో సేవలందిస్తోంది. %ఖ్రా+%లో ఆమె చేరిక దేశంలో భద్రత ,చట్ట అమలులో మహిళలు కీలక స్థానాల్లో అందిస్తున్న సేవలను సూచిస్తుంది.

# వామ్మో..ఇలా చనిపోతున్నారేంటీ.. జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుండగా గుండెపోటు.. బెంగాల్ యువక్రికెటర్ మృతి




హైదరాబాద్ పెన్ పవర్: ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణాలు ఎక్కువయ్యాయి. చిన్న పిల్లలనుంచి వృద్ధుల వరకు ప్రముఖుల నుంచి సాధారణ ప్రజల వరకు వయసుతో సంబంధం లేకుండా కార్డియాక్ అరెస్ట్ తో చనిపోతున్నారు.క్రికెట్ ఆడుతూ ఒకరు.. డ్యాన్స్ చేస్తూ ఒకరు.. కూర్చున్నవారు కూర్చున్నట్లు కూలిపోయిన సంఘటనలు మనం చూస్తున్నాం.. తాజాగా బెంగాల్ కు చెందిన యువ క్రికెటర్ కూడా గుండెపోటుతో మరణించడం ఆందోళన కలిగిస్తోంది. బెంగాల్ కు చెందిన యువ క్రికెటర్ ప్రియజిత్ జిమ్ సెషన్ లో గుండెపోటుతో మృతిచెందాడు. బెంగాల్ అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్ లో అత్యధిక పరుగులు చేసిన 22 యేళ్ల ప్రియజిత్.. బెంగాల్ తరపున రంజీ ట్రోఫీలో ఆడాలని, జాతీయ జట్టులో స్థానం సంపాదించాలని లక్ష్యంతో ఆడుతున్నాడు. క్రికెట్ లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న క్రమంలో ప్రియజిత్ జీవిత ప్రయాణం అర్థంతరంగా ముగిసింది. శుక్రవారం(ఆగస్టు1) ఉదయం జిమ్ లో వర్కవుట్స్ చేస్తుండగా చెమటలు పట్టి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో స్నేహితులు, బంధువులు,సహచరులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రియజిత్ అకాల మరణం బెంగాల్ క్రికెట్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రియజిత్ ఘోష్‌కు క్రికెట్ అంటే చాలా ఇష్టం. రంజీ ట్రోఫీలో బెంగాల్ తరపున ఆడాలని, తరువాత భారత జట్టులోకి రావాలని కలలు కనేవారు. 2018–19 సీజన్‌లో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ నిర్వహించిన అండర్–16 ఇంటర్–డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసి గుర్తింపు పొందారు. యువక్రికెటర్ ప్రియజిత్ ఘోష్ ఆకస్మిక మరణం అలాగే ఇటీవల కాలంలో ఇలాంటి అనేక ఘటనలు యువకులలో గుండెపోటు పెరగడం పట్ల ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ మరణాలు అధిక వ్యాయామంతో గుండెపై పడే ఒత్తిడి, అప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలు,ఇతర కారణాల వల్ల సంభవిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేసే ముందు వైద్య సలహా తీసుకోవడం, శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వడం చాలా ముఖ్యం అని డాక్టర్లు సూచిస్తున్నారు.

# ఇంట్లోకి వరద వస్తే... గంగమ్మ వచ్చిందని పూజించిన పోలీస్ ఆఫీసర్..



హైదరాబాద్ పెన్ పవర్: మాములుగా ఇంట్లోకి వరద వచ్చిందంటే ఎంత కంగారు పోతాం..? ఇంట్లో సామాన్లన్నీ మునిగిపోయి, ఇల్లంతా వరద నీటితో నిండిపోయి పరిస్థితి గందరగోళంగా తయారవుతుంది. కానీ.. ఓ పోలీస్ ఆఫీసర్ మాత్రం ఇంట్లోకి వరద వస్తే.. గంగమ్మ తల్లి ఇంట్లోకి వచ్చిందని పూజలు చేశారు. యూపీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో చంద్రదీప్ అనే పోలీస్ ఆఫీసర్ తన ఇంట్లోకి ప్రవేశించిన వరద నీటికి పూజలు చేశారు. పోలీస్ ఆఫీసర్ వరద నీటికి పాలు, పూలు అర్పించి పూజలు చేస్తున్న వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. యూపీ సహా ఉత్తర భారతదేశంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ఈ క్రమంలో యూపీలోని ప్రయాగ్ రాజ్ లో చంద్రదీప్ అనే పోలీస్ ఆఫీసర్ ఇంట్లోకి వచ్చిన వరద నీటికి పూజ చేస్తున్న వీడియో ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. వరద నీటిలో ఈత కొడుతూ జై గంగా మైయా కి అంటూ నినాదాలు చేస్తున్న వీడియో నెట్టింట వైరల్ గా మారింది.ఇవాళ ఉదయం డ్యూటీకి బయలుదేరుతుండగా గంగమ్మ తల్లి మా ఇంటికి వచ్చిందని.. ఇంటి గుమ్మం దగ్గర గంగా మాతను పూజించి ఆశీస్సులు పొందానని క్యాప్షన్ తో వీడియోను షేర్ చేశారు చంద్రదీప్. చంద్రదీప్ ఇన్‌స్టాగ్రామ్ బయో ప్రకారం, అతను యూపీ పోలీస్ స్విమ్మింగ్ ఛాంపియన్ అని తెలుస్తోంది. యూపీ పోలీస్ ఛాంపియన్ స్విమ్మర్, నేషనల్ స్విమ్మర్ అని తన బయో ద్వారా తెలుస్తోంది.

# ఫ్రెండ్ షిప్ డే సాక్షిగా ఘోరం.. బెస్ట్ ఫ్రెండ్ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం



హైదరాబాద్ పెన్ పవర్: ములుగు మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన ఐకేపీ కంప్యూటర్?ఆపరేటర్?హత్య కేసును పోలీసులు చేధించారు. శనివారం సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐ విజయకుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ములుగు గ్రామానికి చెందిన తీగుళ్ల నెహ్రూ (35), వర్గల్ మండలం మజీద్ పల్లి గ్రామానికి చెందిన గమిలిపురం మహేశ్ ఇద్దరూ స్నేహితులు. వీరి మధ్య తరచుగా చిట్?ఫండ్?డబ్బుల లావాదేవీలు జరిగేవి. ఈ క్రమంలో మహేశ్??కు కొండపాక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో పీఈటీగా పనిచేస్తున్న నిషారాణితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవల చిట్?ఫండ్? కమిషన్?డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య విబేధాలు ఏర్పడడంతో మహేశ్?ఈ నెల 28న నిషారాణి వద్ద ఉన్న బంగారాన్ని మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ వర్గల్ బ్రాంచ్ వద్ద తాకట్టు పెట్టి రూ.58,600 రుణం తీసుకున్నాడు. ఆ డబ్బును అప్పులు కట్టడానికి వినియోగించుకున్నట్టు చెప్పినా ఆమె నమ్మలేదు. నెహ్రూను మధ్య వర్తిగా తీసుకురమ్మని చెప్పింది. ఈ క్రమంలో మహేశ్ అతడిని తీసుకొని నిషారాణి ఇంటికి వెళ్లగా అక్కడ నెహ్రూ ఆమె గురించి అసభ్యకరంగా మాట్లాడడంతో మహేశ్?కోపంతో అతడిపై దాడి చేశాడు.

ఇంట్లో ఉన్న వైర్?ను మెడకు చుట్టి చంపేశాడు. తర్వాత నిషారాణి తండ్రి కొమురయ్య సాయంతో డెడ్?బాడీని కారులో మద్దూరు మండలం గాగిల్లపూర్?లో ఉన్న పొలానికి తీసుకెళ్లి దాచిపెట్టారు. తర్వాత బాడీకి రాళ్లను కట్టి పెద్ద చెరువులో పడేశారు. అనంతరం ఉబ్బని వినయ్ ఫోన్ నుంచి నెహ్రూ భార్యకు ఫేక్ కాల్ చేసి అన్న రేపు వస్తాడని చెప్పాడు. మరునాడు మహేశ్ వెళ్లి అతడి భార్యకు రూ.15000 చిట్టి డబ్బులను ఇచ్చి

నెహ్రూ బాగానే ఉన్నట్లు నమ్మించడానికి ప్రయత్నించారు. మహేశ్?ఫోన్?ను కొండపోచమ్మ కెనాల్?లో పడేసి ట్రేస్?కాకుండా జాగ్రత్త పడ్డారు. ప్రధాన నిందితుడైన గమిలిపురం మహేశ్, సహా నిందితులు నిషా రాణి, ఉబ్బని వినయ్, నారదాసు కొమురయ్యను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మళ్లీ భూకంపం.. బద్దలైన అగ్నిపర్వతం.. సునామీ హెచ్చరికలు



హైదరాబాద్ పెన్ పవర్: రష్యాలో ప్రకృతి మరోసారి తన ప్రతాపాన్ని చూపించింది. ఆదివారం ఉదయం కురిల్ దీవుల ప్రాంతంలో 7.0 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఈ విషయం జపాన్ వాతావరణ శాఖ , యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ద్వారా నిర్ధారించబడింది. భూకంపం తర్వాత రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ పలు తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది, దీంతో ఆయా ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

**భూకంపం ప్రభావం , కమ్చట్కాలో అగ్నిపర్వత విస్ఫోటనం**

భూకంపం ధాటికి పలు నగరాల్లో భవనాలు ఊగిపోవడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం గురించి ఎటువంటి సమాచారం లేదు, కానీ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ భూకంపం ప్రభావంతో, కమ్చట్కా ద్వీపకల్పంలోని క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం శనివారం అర్ధరాత్రి బద్దలైంది. దాదాపు 600 సంవత్సరాల తర్వాత ఈ అగ్నిపర్వతం తిరిగి చురుకుగా మారింది. విస్ఫోటనం కారణంగా దాదాపు 6,000 మీటర్ల ఎత్తు వరకు బూడిద ఎగసిపడింది. ఇది అక్కడి వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదాన్ని సూచిస్తోంది.

**మరో అగ్నిపర్వతం కూడా చురుకుగా మారింది**

క్రాషెన్నినికోవ్ తో పాటు, అదే కమ్చట్కా ద్వీపకల్పంలో ఉన్న మరో అత్యంత చురుకైన అగ్నిపర్వతం క్ల్యుచెస్కీ కూడా బద్దలైందని సమాచారం. ఈ రెండు అగ్నిపర్వతాల విస్ఫోటనం వలన రష్యాలోని ఈ ప్రాంతం , అక్కడి వాతావరణం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. గతంలో కూడా, ఇదే కమ్చట్కా ప్రాంతంలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించి, రష్యా, జపాన్ మరియు ఉత్తర పసిఫిక్ తీర ప్రాంతాలపై సునామీ రూపంలో తీవ్ర ప్రభావం చూపింది. నిపుణుల ప్రకారం, 2011 తర్వాత పసిఫిక్ ప్రాంతంలో నమోదైన అత్యంత తీవ్రమైన భూకంపం ఇది.

**ప్రజలకు హెచ్చరికలు**

రష్యా, జపాన్ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తక్షణమే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సునామీ హెచ్చరికలను తీవ్రంగా పరిగణించాలని అధికారులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని భూ ప్రకంపనలు సంభవించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండటమే శ్రేయస్కరం.

సారాంశంగా, రష్యాలో భూకంపం , రెండు అగ్నిపర్వతాల విస్ఫోటనం ఒకేసారి సంభవించడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. ఈ విపత్కర పరిస్థితులు అక్కడి ప్రజల జీవితాలను..వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అధికారిక హెచ్చరికలను పాటించడం చాలా ముఖ్యం.

# పదవి నుంచి తొలగించినా.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో రాజకీయ వేడి నిత్యం పెరుగుతూనే ఉంది. ఈ తరుణంలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. చొప్పదండి నియోజకవర్గంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తనపై వస్తున్న ఆరోపణలకు ఘాటుగా స్పందించారు.

**"పదవి మారినా నేను మారను"**

"కేంద్ర మంత్రిగా ఉన్నా లేకున్నా నేను మారను. నేను ప్రజల మనిషిని. నాపై వచ్చే అవాస్తవాలను ప్రచారం చేయొద్దని కోరుతున్నా" అంటూ బండి సంజయ్ స్పష్టంగా చెప్పారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో తనను మంత్రి పదవి నుంచి తొలగించారని, తానే రాజీనామా చేశానంటూ జరుగుతున్న ప్రచారాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. అవన్నీ అవాస్తవాలేనని ఖండించారు.

**"పదవి కోరి కాదు.. పార్టీ ఆహ్వానం ఇచ్చి ఇచ్చింది"**

బండి సంజయ్ మాట్లాడుతూ "నాకు మంత్రిత్వం కావాలని ఎప్పుడూ కోరలేదు. పార్టీ ఆహ్వానం ఇచ్చి నాకు బాధ్యతలు అప్పగించింది. భవిష్యత్తులో పార్టీ అవసరమైతే ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా" అన్నారు. తనను టార్గెట్ చేస్తూ కొంతమంది పని లేని వారు విమర్శలు చేస్తున్నారని, కానీ తాను ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తానని హామీ ఇచ్చారు.

**"రిజర్వేషన్లపై కాంగ్రెస్ కక్షసాధింపు విధానం"**

రాజకీయంగా కీలకమైన రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ, బండి సంజయ్ బీసీ సామాజిక వర్గాలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. "42 శాతం రిజర్వేషన్ ఒక వర్గానికే ఇస్తే, మిగతా వర్గాల పరిస్థితి ఏమిటి? ముస్లింలకు 10 శాతం ఇచ్చి, అదే సమయంలో బీసీలకు 42 శాతం అంటారా? ఇది వంచన కాదు ఏమిటి?" అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

**"బీజేపీ లక్ష్యం బీసీల అభ్యున్నతి"**

బండి సంజయ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వమే బీసీలకు మేలు చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా బీసీ వర్గానికి చెందినవాడేనని, ఆయన్ను ప్రధానిగా చేసింది బీజేపీయే అని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం గత పదకొండు సంవత్సరాల్లో 71 లక్షల కోట్ల రూపాయలు రైతులకు అందించిందని వెల్లడించారు. తనపై విమర్శలు చేస్తున్నవారిపై స్పందిస్తూ " విమర్శలు చేయడం తగదు. నేను ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చా, ప్రజల కోసమే ఉంటా. ఒక్కొక్కరి లెక్కలు త్వరలో తేలతాయి" అని బండి సంజయ్ హెచ్చరించారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు పార్టీ అంతర్గత పరిస్థితులకు, రాష్ట్ర రాజకీయాలకు ప్రాధాన్యతను చాటుతున్నాయి. పదవికి అతీతంగా ప్రజలతో మమేకమైన నాయకుడిగా కొనసాగుతానన్న ఆయన వ్యాఖ్యలు బీజేపీ వర్గాల్లో విశ్వాసాన్ని పెంచనున్నాయి. మరోవైపు, రిజర్వేషన్ అంశంపై బీసీలకు మద్దతుగా తీసుకున్న స్థానం, కాంగ్రెస్ ప్రభుత్వంపై వేసిన విమర్శలు రాజకీయ దిశలో కొత్త చర్చలకు దారి తీశాయి.

# ఉప రాష్ట్రపతిగా బీసీ నేత దక్షిణాది వారికే అవకాశం

హైదరాబాద్ పెన్ పవర్:ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా తర్వాత తదుపరి ఆ బాధ్యతలు స్వీకరించే నేత ఎవరు? అన్న చర్చ ఉత్కంఠకు దారితీస్తోంది. పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్డీఏ కూటమికి సంపూర్ణ మెజార్టీ ఉండటంతో కాబోయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ నేతను ఎంపిక చేయొచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్ తోపాటు బిహార్ కు చెందిన పలువురు నేతల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఇక ఇదే సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని కూడా త్వరలో భర్తీ చేయనుండటం, బీజేపీ అధ్యక్ష పదవిని మహిళకు కేటాయించొచ్చన్న ఊహాగానాలతో ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ఆసక్తికరంగా మారుతోంది.

ప్రస్తుతం ఉన్న సామాజిక సమీకరణల దృష్ట్యా ఉప రాష్ట్రపతిగా బీసీ నేతను ఎంపిక చేయొచ్చని తాజాగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అదీ దక్షిణాది ప్రాంతానికి చెందిన బీసీలకు అవకాశం ఇవ్వాలని సంఘ్ పరివార్ ప్రతిపాదిస్తోందని అంటున్నారు. రాజీనామా చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఓబీసీ వర్గానికి చెందిన వారు. అదేవిధంగా రాష్ట్రపతిగా ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్ము ఉన్నారు. అదేవిధంగా బీజేపీ అధికారంలోకి వచ్చాక ఒక ఎస్సీ, ఒక ఎస్టీని రాష్ట్రపతి చేసింది. ఉప రాష్ట్రపతి పదవిని గతంలో ఒకసారి అగ్రవర్ణాలకు కేటాయించగా, రెండోసారి బీసీ వర్గానికి చెందిన జగదీష్ ధన్ ఖర్ కు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో బీసీ రాజీనామా చేసిన ఉప రాష్ట్రపతి పదవిని మళ్లీ అదే వర్గానికి కేటాయించడం సముచితమంటూ బీజేపీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది.

ఇక ఉప రాష్ట్రపతి అంటే ఐదేళ్ల తర్వాత రాజకీయ విరామం తీసుకోవాల్సిందేనన్న భావనతో కేంద్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రులు వెనక్కి తగ్గుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా కేంద్ర మంత్రి వర్గంలో చక్రం తిప్పిన వెంకయ్య నాయుడును ఉప రాష్ట్రపతిని చేశారు. ఐదేళ్ల పదవీకాలం తర్వాత ఆయనను రాష్ట్రపతిగా ప్రమోట్ చేయలేదు. దీంతో ఆయన రాజకీయంగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నారు. ఈ కారణంతోనే జేపీ నడ్డా, రాజనాథ్ సింగ్ వంటి వారు ఉప రాష్ట్రపతి పదవిపై సముఖత వ్యక్తం చేయడం లేదని అంటున్నారు.

దీంతో ఉప రాష్ట్రపతి పదవికి తగిన బీసీ నాయకుడి ఎంపిక కోసం బీజేపీ పెద్దలు జల్లెడ పడుతున్నట్లు చెబుతున్నారు. దక్షిణాదికి చెందిన బీసీ నేతను ఎంపిక చేయాలని భావిస్తుండటంతో హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ పేరు తెరపైకి వచ్చింది. ఆయన గవర్నర్ గిరీ గత నెలలోనే ముగిసింది. ఆయన స్థానంలో బీజేపీ అషిమ్ కుమార్ ఘోష్‌ను నియమించింది. దీంతో ప్రస్తుతం దత్తాత్రేయ ఏ పదవీ లేకుండా ఖాళీగా ఉన్నారు. దత్తాత్రేయను ఉప రాష్ట్రపతి చేస్తే ఏకగ్రీవం అయ్యేలా సహకరిస్తామని ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో దత్తాత్రేయ పేరు ప్రముఖంగా చర్చకు వస్తోంది. అన్నిపార్టీలతో సత్సంబంధాలు ఉన్న దత్తాత్రేయకు సౌమ్యుడిగా గుర్తింపు ఉంది. అదే సమయంలో గవర్నర్ గా, కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఆయనకు కలిసివస్తోందని అంటున్నారు. అంతేకాకుండా బీజేపీ, సంఘ్‌తో దత్తాత్రేయకు చాలాకాలంగా అనుబంధం ఉంది. ఈ పరిస్థితుల్లో ఉప రాష్ట్రపతి పదవికి దత్తాత్రేయ తగిన వారు అన్న ప్రచారం వినిపిస్తోంది.

# రసవత్తరంగా ఓవల్ టెస్ట్.. టీమిండియాకు అడ్డుకున్న రూట్, బ్రూక్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓవల్ వేదికగా ఇండియా, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న ఐదో టెస్టు రసవత్తరంగా జరుగుతోంది. రెండు జట్లు విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. నాలుగో రోజు తొలి సెషన్ లలో ఇంగ్లాండ్ 114 పరుగులు రాబడితే టీమిండియా రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో రెండో సెషన్ ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది. 374 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ నాలుగో రోజు లంచ్ సమయానికి 3 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. క్రీజ్ లో రూట్ (23), బ్రూక్ (38) ఉన్నారు. ఇండియా గెలవాలంటే 7 వికెట్లు తీయాలి. మరోవైపు ఇంగ్లాండ్ విజయానికి 210 పరుగులు అవసరం. వికెట్ నష్టానికి 50 పరుగులతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ తొలి అరగంట సేపు వికెట్ కోల్పోకుండా జాగ్రత్తగా ఆడింది. పోప్, డకెట్ కలిసి ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో డకెట్ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. లక్ష్యం వైపుగా దూసుకెళ్తున్న ఇంగ్లాండ్ కు ప్రసాద్ కృష్ణ బిగ్ షాక్ ఇచ్చాడు. డకెట్ (54) ను ఔట్ చేసి టీమిండియాకు రెండో వికెట్ అందించాడు. కాసేపటికే కెప్టెన్ పోప్ (27) ను సిరాజ్ పెవిలియన్ కు పంపాడు. దీంతో 106 పరుగుల వద్ద ఇంగ్లాండ్ మూడో వికెట్ కోల్పోయి కష్టాల్లో పడినట్టు కనిపించింది. ఈ దశలో ఇంగ్లాండ్ ను రూట్, బ్రూక్ భాగస్వామ్యం నిలబెట్టింది. ఒక ఎండ్ లో రూట్ ఆచితూచి ఆడుతుంటే మరో ఎండ్ లో బ్రూక్ భారత బౌలర్లపై ఎదురు దాడికి దిగాడు. దీంతో వేగంగా పరుగులు వచ్చాయి. ప్రసిద్ బౌలింగ్ లో బ్రూక్ ఇచ్చిన క్యాచ్ సిరాజ్ బౌండరీ దగ్గర విడిచిపెట్టడంతో ఇంగ్లాండ్ ఊపిరి పీల్చుకుంది. ఇద్దరూ మరో వికెట్ పడకుండా తొలి సెషన్ ముగించారు. భారత బౌలర్లలో సిరాజ్ కు రెండు వికెట్లు దక్కాయి. ప్రసిద్ కృష్ణ ఒక వికెట్ తీసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్ లో ఇండియా 224 పరుగులకు ఆలౌట్ అయితే.. ఇంగ్లాండ్ 247 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్ లో ఇండియా 396 పరుగులకు ఆలౌట్ అయింది.

# ఇలా షాక్ ఇచ్చావేంటి హిట్ మ్యాన్: రూ.2.46 కోట్ల వాచ్ ధరించిన రోహిత్ శర్మ





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ టెస్ట్ కెప్టెన్ రోహిత్ శర్మ ఓవల్ టెస్ట్ చూడడానికి వచ్చి ఫ్యాన్స్ ను సర్ ప్రైజ్ చేసిన సంగతి తెలిసిందే. శనివారం (ఆగస్టు 2) ఉదయం లండన్‌లోని ది ఓవల్‌లో కనిపించిన రోహిత్ మూడో రోజు ఆటకు హాజరయ్యాడు. చాలా సింపుల్ డ్రెస్ వేసుకొని.. కూలింగ్ గ్లాస్ పెట్టుకొని రిలాక్స్‌గా మ్యాచ్ ఎంజాయ్ చేస్తూ కనిపించాడు. గ్రౌండ్ లో ఉన్న ప్రేక్షకులు హిట్ మ్యాన్ కు చప్పట్లు కొడుతూ ఆహ్వానించారు. జైశ్వాల్ సెంచరీ కొట్టిన తర్వాత చప్పట్లు కొడుతూ భారత యువ జట్టును ఎంకరేజ్ చేస్తూ కనిపించాడు. ఓవల్ టెస్టుకు రోహిత్ శర్మ రావడం ఒక విశేషమైతే.. హిట్ మ్యాన్ తన చేతికి పెట్టుకున్న వాచ్ మరొక విశేషం. సెలెబ్రిటీలు భారీ వస్తువులను కొనడం.. ధరించడం చాలా కామన్. కానీ రోహిత్ శర్మ వాచ్ ఖరీదు నోరెళ్లబెట్టేలా చేస్తోంది. ఓవల్ టెస్టుకు రోహిత్ శర్మ టైటానియం వాచ్ ధరించాడు. దీని ధర అక్షరాలా 2.46 కోట్లు కావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏదైనా హిట్ మ్యాన్ తన వాచ్ తో ఒక్కసారిగా అందరినీ షాక్ కు గురి చేశాడు. టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు.

స్వదేశంలో న్యూజిలాండ్ తో మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ క్లీన్ స్వీప్ కావడం.. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 1-3 తేడాతో కోల్పోవడం హిట్ మ్యాన్ టెస్ట్ కెరీర్ పై తీవ్ర ప్రభావం చూపించింది. దీనికి తోడు బ్యాటింగ్ లో పేలవ ఫామ్ అతని రిటైర్మెంట్ కు కారణమైంది. రోహిత్‌శర్మ టెస్ట్ క్రికెట్ లో 67 టెస్టుల్లో 4,301 పరుగులు చేశాడు. వీటిలో 12 సెంచరీలు 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.ఇప్పటికే టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్.. ఇకపై కేవలం వన్డే క్రికెట్ మాత్రమే ఆడనున్నాడు.

ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్ విషయానికి వస్తే 374 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ నాలుగో రోజు లంచ్ సమయానికి 3 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. క్రీజ్ లో రూట్ (23), బ్రూక్ (38) ఉన్నారు. ఇండియా గెలవాలంటే 7 వికెట్లు తీయాలి. మరోవైపు ఇంగ్లాండ్ విజయానికి 210 పరుగులు అవసరం. నాలుగో రోజు తొలి సెషన్ లలో ఇంగ్లాండ్ 114 పరుగులు రాబడితే టీమిండియా రెండు వికెట్లు పడగొట్టింది.

# సచిన్, కోహ్లిలలో ఎవరు బెస్ట్.. డివిలియర్స్ సమాధానమిదే!





**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ టీమిండియా తరపున బ్యాటింగ్ రికార్డులన్నీ తమ పేరిట లిఖించుకున్నారు. అప్పటి తరంలో సచిన్ ప్రత్యర్థులకు చుక్కలు చూపించేవాడు. ఇప్పుడు కింగ్ కోహ్లీ క్రీజ్ లో ఉంటే ఎదురుగా ఎలాంటి జట్టు ఉన్నా బెంబేలిత్తిస్తాడు. రెండు దశాబ్దాలుగా సచిన్ బౌలర్లపై ఆధిపత్యం చూపిస్తే.. మోడ్రన్ క్రికెట్ లో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ కు ఐకాన్ గా మారాడు. ఈ ఇద్దరిలో ఎవరు గ్రేట్ అనే విషయం చెప్పడం కష్టం. అయితే ఇదే ప్రశ్న సౌతాఫ్రికా దిగ్గజ బ్యాటర్, మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్ కు ఎదురైంది.వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ ఫైనల్ తర్వాత శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్ లో మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని చెప్పాడు. డివిలియర్స్ మాట్లాడుతూ.. “నాకు సచిన్ అంటే చాలా గౌరవం ఉంది. ఎంత ఎదిగినా ఒదిగి ఉంటాడు. విరాట్ నాకు ఫ్రెండ్. ఇద్దరు రెండు జెనరేషన్స్ కు చెందినవారు. వారిద్దరిని పోల్చడం సరికాదు. కాబట్టి చెప్పడం చాలా కష్టం. విరాట్ అన్ని ఫార్మాట్లలో గొప్ప ఆటగాడని నేను అనుకుంటున్నాను. సచిన్ లాంగ్ ఫార్మాట్‌లో గ్రేట్”. అని డివిలియర్స్ అన్నాడు.

తాజాగా ముగిసిన వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ లో డివిలియర్స్ తన విశ్వ రూపాన్ని చూపించాడు. పాకిస్థాన్ తో జరిగిన ఫైనల్లో 60 బంతుల్లోనే 7 సిక్సర్లు, 12 ఫోర్లతో 120 పరుగులు చేసి పాకిస్థాన్ కు చుక్కలు చూపించాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌లలో 431 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్ గా నిలిచాడు. డివిలియర్స్ యావరేజ్ 143.67 కాగా.. స్ట్రైక్ రేట్ 221.03 ఉండడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు డివిలియర్స్ కే లభించాయి.

2018, ఫిబ్రవరిలో సౌతాఫ్రికా తరపున చివరి అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడిన ఏబీడీ.. అదే ఏడాది ఏప్రిల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ప్రొటీస్ జట్టుకు ఆఖరుసారి ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో డివిలియర్స్ 5 వేలకు పైగా పరుగులు చేయడం విశేషం. ఇక అంతర్జాతీయ క్రికెట్ విషయానికొస్తే.. 114 టెస్టుల్లో 8,765 రన్స్, వన్డేల్లో 228 మ్యాచ్‌లు ఆడి 9,577 పరుగులు చేశాడు. ఇక టీ20 ల్లో 78 మ్యాచుల్లో 1,672 పరుగులు చేశాడు.

# తమన్నా పెళ్లి.. అతడు ఎవరో తెలుసా?

ఒక రోజు క్రికెటర్ తో .. మరో రోజు సహనటుడితో.. ఇంకోరోజు డాక్టర్- బిజినెస్‌మేన్‌తో... ఇకపైనా ఎవరితో ముడిపెడతారో తెలీదు! మొత్తానికి తమన్నా ఎవరో ఒకరిని పెళ్లాడేయబోతోందనే పుకార్లు ఇప్పటికీ ఆగడం లేదు. తమన్నా భాటియా- విజయ్ వర్మ ప్రేమాయణం, జంట షికార్ల గురించి చాలా కాలం పాటు ప్రచారం సాగింది. కానీ ఈ జంట బ్రేకప్ అవ్వడం అభిమానులకు షాకిచ్చింది. ఇది ఊహించనిది. కానీ కాలంతో పాటే గతించిపోయే శాశ్వత నిజం.



**నిప్పు లేదు పొగ లేదు అయినా..**

అయితే తమన్నాను ఇప్పటికీ మీడియాలు వదిలి పెట్టడం లేదు. మిల్కీ వైట్ బ్యూటీకి ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారంటూ నెటిజనుల్లో నిరంతరం ప్రచారం సాగుతూనే ఉంది. కథానాయికల విషయంలో ఇలాంటి ప్రచారం సహజమే అనుకున్నా, నిప్పు లేదా పొగ ఈ రెండిటిలో ఏ ఒక్కటీ లేకపోయినా ఇలాంటివి ఎలా పుట్టిస్తున్నారో ఎవరికీ అర్థం కాని గందరగోళాన్ని సృష్టిస్తోంది.

**పాకిస్తానీ క్రికెటర్ ని కలిసాను:**

ఒకానొక సందర్భంలో తమన్నా మాట్లాడుతూ.. తనపై సాగుతున్న తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేకపోయానని అన్నారు. ఒకసారి పాకిస్తాన్ క్రికెటర్ అబ్దుల్ రజాక్ తో ముడిపెట్టారని కూడా ఆవేదన చెందారు. అబ్దుల్ రజాక్ నేను ఓ ఆభరణాల దుకాణం ఓపెనింగులో కలిసాం. ఆ షాప్ పేరేమిటో తెలీదు కానీ, అతడిని నేను కలిసాను అని నెటిజనులు రాసారు. రజాక్ ని పెళ్లాడుతున్నానని కూడా ప్రచారం చేసారు.



మీతా రఘునాథ్ తన తాజా చిత్రంలో సహజంగా మరియు తాజాగా ఉంచారు

**నా భర్త నేను షాపింగ్‌లో..**

ఓ పాడ్ కాస్ట్ లో ఈ విచిత్రమైన ప్రచారం గురించి ప్రస్థావిస్తూ తమన్నా కొంత ఇబ్బందికరంగా ఫీలైంది. సహ నటుడు, డాక్టర్ లేదా క్రికెటర్ తో నన్ను ఎవరో ఒకరితో ముడి వేస్తారు. నేను నా భర్త షాపింగ్ లో ఉన్నామనే భావన తెచ్చేస్తారు. ప్రేమలో ఉండటం అనే ఆలోచన నాకు చాలా ఇష్టమే అయినా కానీ, నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే నేను నిరాధారమైన వార్తలను అంగీకరించను. నేను ప్రస్తుతం ఒంటరిగా సంతోషంగా ఉన్నాను. నా తల్లిదండ్రులు వరుడి కోసం వెతుకులాటలో లేరు..! అని కూడా తమన్నా తనపై తప్పుడు ప్రచారాన్ని ఖండించారు.

**ప్రస్తుతం ఒంటరిని...**

నేను ప్రస్తుతం ఒంటరిగా ఉన్నాను.. ఒకవేళ ప్రేమలో పడ్డాను అంటే అది కేవలం సినిమాలతో మాత్రమే. నిరంతరం సినిమాల్లో నటించేందుకు వెతుకుతూనే ఉంటాను. అసలు ఈ ఊహాగానాలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తాయో కానీ ఒక్కటీ నిజం కాదు. నేను నా మార్గంలో వెళుతున్నాను. ఒకవేళ గౌరవనీయమైన వివాహవ్యవస్థలోకి అడుగుపెడితే కచ్చితంగా అందరికీ చెబుతాను. నాపై తప్పుడు కథనాలు రాయడం అగౌరవం అని కూడా తమన్నా నాటి పాడ్ కాస్ట్ లో వ్యాఖ్యానించారు.

**వరుస చిత్రాలతో బిజీ..**

కెరీర్ మ్యాటర్ కి వస్తే.. తమన్నా ఇటీవల ఓదెలా 2 చిత్రంతో అభిమానులను అలరించింది. యాక్షన్ హీరో అజయ్ దేవగన్ సరసన - రైడ్ 2 - లోను నటించింది.

ప్రస్తుతం వరుస చిత్రాలతో మిల్కీ బిజీ బిజీగా ఉంది. బాలీవుడ్ లో రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ చిత్రంలో నటిస్తున్న తమన్నా, - వి-వాన్- ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్ - అనే చిత్రంలోను నటిస్తోంది. అడవి నేపథ్యంలో రూపొందుతున్న - రేంజర్ - లో అజయ్ దేవగన్ సరసన తమన్నా ఆడిపాడనుంది. ఈ సినిమాని ఇటీవలే ప్రకటించారు.



Saiee యొక్క ఫ్యాషన్ ఎంపికలు మొత్తం హృదయాన్ని కదిలించేవి

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com